# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

6.2.2026 శుక్రవారం | సంపుటి (volume): 1 సంచిక (Issue): 206 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


# బీజేపీకి ఒక్కసీటు రాకుండా చేస్తాం

ప్రజాపాలన అందిస్తుంటే విషం చిమ్ముతున్నారు

## ఓ కుటుంబం మొత్తం ప్రభుత్వం పడిపోవాలని చూస్తోంది



- అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశాం
- ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియమ్మది
- పదేళ్లలో బీఆర్ఎస్ పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు
- బీజేపీ అధ్యక్షుడు పాలమూరుకు వచ్చి హామీలపై మాట్లాడలేదు
- బీజేపీకి ఈ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా రాకుండా చేస్తాం
- కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్
- పార్టీ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో కలసి పనిచేయాలని హితవు

**కరీంనగర్, ఫిబ్రవరి 5:** ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే కొందరు విషం చిమ్ముతున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం మొత్తం దాడికి దిగుతోందని పరోక్షంగా కెసిఆర్ కుటుంబంపై ఆరోపణలు చేశారు. తెలంగాణలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ. 17,442 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పర్యటించిన సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు.

మిగతా 2 లో



# వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం పరుగులు

- ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది
- 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నాం
- ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణల అమలు
- కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు.. ఓట్ బ్యాంక్ రాజకీయాలు
- రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో మోడీ
- విపక్షాల నిరసనుల.. నినాదాలు.. చివరకు వాకౌట్


4

రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్

వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నాయని అన్నారు. సరైన దిశలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. విపక్ష నేతల నిరసనలు, నినాదాల నడుమ ప్రధాని ప్రసంగించారు. ఆ తరువాత కొద్ది సేపటికే విపక్షాలు వాకౌట్ చేశాయి.

## గ్రూప్-1 ఉద్యోగులకు ఊరట

2



సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన ధర్మాసనం

## మేడారంలో గ్యాంగ్ రేప్ జరగలేదు



మహిళా కమిషన్ ఎంక్వయిరీ కమిటీ

3



2

## ఉమెన్స్ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

సకాలంలో మంటలర్పిన అగ్నిమాపక సిబ్బంది

ఉదయం అంతా బయటకు వెళ్లడంతో తప్పిన ప్రాణాపాయం

## పన్నెండేళ్లుగా తెలంగాణలో బానిస ప్రభుత్వాలు

- పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్‌తో ఒరింగింది శూన్యం
- మజ్లిస్ కనుసన్నల్లోనే రెండు ప్రభుత్వాల పాలన
- మద్యం ఆదాయం.. భూముల అమ్మకం ఇదే పాలసీనా
- రేంవత్ సర్కార్‌పై ఘాటు విమర్శలు చేసిన కిషన్ రెడ్డి

3





## మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన మంత్రి

వివరాలు 2లో

## తులం బంగారం వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయండి

- పదేళ్ల బీఆర్ఎస్ అభివృద్ధి.. రెండేళ్ల కాంగ్రెస్ ధోఖా పనులు
- సిరిసిల్ల ప్రచారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్


3



ఓవైపు అభివృద్ధి చేసిన బీఆర్ఎస్, మరోవైపు ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్, ఎప్పుడో ఒకసారి దేవుని పేరు చెప్పుకుని వచ్చే బీజేపీ పార్టీలు ఉన్నాయి. ఎవరికి ఓటు వేయ్యాలో మీరే నిర్ణయించుకోవాలి.. అని కేటీఆర్ అన్నారు.

# మేఘాలయలో ఘోరం

బొగ్గు గనిలో పేలుడు ■ 16మంది కూలీల మృతి



మేఘాలయలో ఘోర ప్రమాదం జరిగింది. బొగ్గు గనిలో భారీ పేలుడు జరిగి 16 మంది ప్రాణాలు కోల్పోయారు. బొగ్గు గనిలో మరింత మంది చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. రెస్క్యూ టీం సహాయక చర్యలు కొనసాగిస్తోంది. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలోని గనిలో బొగ్గు తవ్వకాలు సమయంలో పేలుడు జరిగింది. గురువారం ఉదయం సమయంలో థాంగ్స్కు ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఈ బొగ్గు గనిని అక్రమ బొగ్గు గనిగా అధికారులు గుర్తించారు.

వివరాలు 4వ పేజీలో

4




## అందుబాటులోకి భారత్ ట్యాక్సీ

- యాప్‌ను ప్రారంభించిన అమిత్ షా

ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్రమంత్రి అమిత్ షా గురువారం ఈ యాప్‌ను ప్రారంభించారు.

4

# ఉమెన్స్ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

**సకాలంలో మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది**

**ఉదయం అంతా బయటకు వెళ్లడంతో తప్పిన ప్రాణాపాయం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 5:** ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో గల ఓ ఉమెన్స్ హాస్టల్లో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై స్థానికులు అగ్నిమాపక అధికారులు, పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అదృష్టవశాత్తూ ప్రమాద సమయంలో ఆ వసతి గృహంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌లోని సుధామ పీజీ అకామడేషన్ ఫర్ ఉమెన్స్ హాస్టల్లో అగ్నిప్రమాదం జరిగింది. హాస్టల్‌లో ఉన్న యువతులంతా.. విధులు, కాలేజీలకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఒకవేళ రాత్రి సమయంలో లేదా విద్యార్థులున్న సమయంలో ఈ ఘటన జరిగి ఉంటే పరిస్థితి అత్యంత దారుణంగా ఉండేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించి ఉండవచ్చని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న మూడు ఫైర్ ఇంజిన్లు.. మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయి. అగ్నిమాపక సిబ్బందితో పాటు హైడ్రా బృందాలు కూడా సహాయక చర్యల్లో పాల్గొని మంటలు పక్క భవనాలకు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నాయి. నగరంలోని పీజీ హాస్టళ్లలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండటానికి పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచనలు చేశారు. పాత పీజీ హాస్టళ్లలో ఎలక్ట్రికల్ వైరింగ్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయించాలని అన్నారు. ప్రతి అంతస్తులో ÷ర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచాలని కోరారు. షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు ఎలా స్పందించాలో హాస్టల్ విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ముషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆస్తి నష్టం ఎంత జరిగిందనే దానిపై అధికారులు అంచనా వేస్తున్నారు.




# గ్రూప్-1 ఉద్యోగులకు ఊరట

**సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన ధర్మాసనం**

**హైదరాబాద్,ఫిబ్రవరి 5 :** గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు ఊరట కల్పించింది. గ్రూప్ 1 నియామకాల వ్యవహారంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. గతంలో.. గ్రూప్ 1 నియామకాలపై విచారణ చేపట్టిన సింగిల్ బెంచ్ ధర్మాసనం.. జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాలను పునః మూల్యాంకనం చేయాలని నాడు న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతో పాటు ఇప్పటికే ఎంపికైన అభ్యర్థులు హైకోర్టులో పిల్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి.. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. తుది తీర్పునకు లోబడి గ్రూప్ 1 నియామకాలు చేపట్టవచ్చని ఇప్పటికే గతంలో ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల ఆధారంగా ప్రభుత్వం ఇప్పటికే 562మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసింది.

**అభ్యర్థులకు సిఎం అభినందన**

గ్రూప్ -1 నియామకాల అంశంలో హైకోర్టు తీర్పుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు తీర్పును హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామన్నారు. ఎందరు, ఎన్ని కుట్రలు పన్ని.. ఉద్యోగ నియామకాలను అడ్డుకోవాలని చూసినా.. వారి కుట్రలు, కుతంత్రాలను ఛేదించి న్యాయ పోరాటంలో విజయం సాధించామని తెలిపారు. న్యాయస్థానం తీర్పు నేపథ్యంలో 563 మంది గ్రూప్-1 అభ్యర్థులకు అభినందనలు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారి గ్రూప్ -1 అధికారులుగా మీరు నియమితులయ్యారు. ఇక రాష్ట్ర పునర్ నిర్మాణానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

# మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

**లెక్కింపునకు పది రోజుల సమయం పట్టే అవకాశం**



**హనుమకొండ, ఫిబ్రవరి 5:** ఆసియా అతిపెద్ద గిరిజన జాతర మేడారం హుండీల లెక్కింపు ప్రారంభమైంది. హుండీల లెక్కింపునకు పది రోజుల సమయం పడుతుందని భావిస్తున్నారు. రెండేళ్లకోసారి వచ్చే ఈ మహా జాతర గత నెల 28 నుంచి 31 వరకు జరిగింది. సమ్మక్క, సారలమ్మలను కోట్లాది మంది భక్తులు దర్శించుకుంటారు. జాతరకు నెల రోజుల ముందు, జాతర అనంతరం మరికొన్నిరోజులు మేడారంను భక్తులు సందర్శిస్తారు. ఈ మహా జాతర హుండీలను హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపానికి తీసుకువచ్చారు. గురువారం మంత్రి కొండా సురేఖ కొబ్బరికాయ కొట్టి లెక్కింపును ప్రారంభించారు. మేడారం జాతరకు తరలి వచ్చిన భక్తులు అమ్మవార్లకు కానుకలు సమర్పించుకున్నారు. క్రితంసారి మేడారం జాతరకు రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది.

# కరీంనగర్, వరంగల్‌ను జంట నగరాలుగా తీర్చిదిద్దుతాం

**కరీంనగర్‌కు రింగ్ రోడ్డు నిర్మిస్తాం**

**గోదావరి పుష్కరాల్లో బాసర నుంచి భద్రాద్రి వరకు అభివృద్ధి**

**రామడుగులో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్**

**కరీంనగర్ పర్యటనలో పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపన**



**కరీంనగర్,ఫిబ్రవరి 5:** కరీంనగర్ జిల్లా చొప్పదండిలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసారు. 2027 లో గోదావరి పుష్కరాలు రాబోతున్నాయి. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ఆలయాలను అభివృద్ధి చేస్తాం అని సిఎం అన్నారు. ఎకో టూరిజంను అభివృద్ధి చేసి పర్యాటక క్షేత్రంగా తీర్చి దిద్దుతాం అన్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ దర్శనానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రాలేదని అంటూ.. పేదోళ్ల దేవుళ్లను మొక్కేందుకు వాళ్లకు నామోషీ. తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం అన్నారు. కరీంనగర్‌కు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తాం. వరంగల్, కరీంనగర్ జంట నగరాలుగా అభివృద్ధి చేసి రెండింటి మధ్యలో డంప్ యార్డు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తాం అని అన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.45.15 కోట్లతో కరీంనగర్ జిల్లా రామడుగులోఅడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రు. 5 కోట్లతో కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చొప్పదండి మండలం గుమ్లాపూర్ లో ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన- ప్రగతి బాట' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేస్తామని కరీంనగర్ గడ్డపై నుంచి సోనియా గాంధీ మాట ఇచ్చారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సర్వం కోల్పోయినా.. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఏర్పాటు చేశారని అన్నారు. పదేళ్లు అంది వచ్చిన అధికారాన్ని అవకాశాన్ని ఉపయోగించుకుని బీఆరెస్ నాయకులు వేల కోట్లు సంపాదించుకున్నారు తప్ప ప్రజలకు చేసిందేం లేదు. పదేళ్ల తర్వాత ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటే ఇప్పుడు వాళ్లు విషం చిమ్ముతున్నారు. పదేళ్లలో కనీసం పేదలకు డబుల్ బెడ్రూంలు కూడా ఇవ్వలేదు. ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చుకుంటున్నాం. రైతులకు ఉచిత కరెంట్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్.. అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 10 లక్షల వరకు పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నాం. సన్నబియ్యం, ఆర్టీసీలో మహిళలకు ఉచితసౌకర్యం అందించాం అన్నారు. పదేళ్లలో బీఆరెస్ ఏం చేసింది, పన్నెండేళ్లల్లోమోదీ ఏం చేశారో చర్చిద్దాం రండి? రెండేళ్లలో మేం ఏం చేశామో చెబితే మీ గుండెలు పగులుతాయ్ అని సిఎం అన్నారు. నిరుద్యోగులకు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం అన్నారు. వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. హాస్టల్ విద్యార్థులకు కాస్మొటిక్, డైట్ చార్జీలు పెంచాం. చొప్పదండిలో డిగ్రీ కాలేజీ నిర్మిస్తున్నాం.



రైతులకు 25 లక్షల 35 వేల మంది రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేశాం 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా అందించాం. కేవలం రైతుల కోసమే రెండేళ్లలో లక్ష కోట్లు ఖర్చు చేశాం. వరి వేస్తే ఉరి అనిమీరంటే.. రైతులు పండించిన ప్రతీ గింజ మా ప్రభుత్వం కొంటుంది. వ్యవసాయం పండుగ చేసి చూపిస్తున్నాం.. ఆడబిడ్డలు కట్టుకునే చీరల్లో కూడా గత ప్రభుత్వంలో కమిషన్లు తీసుకున్నారని మండిపడ్డారు. మా ప్రభుత్వం ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం రెండేళ్లల్లో రూ. 9 వేల కోట్లు ఖర్చు చేశాం. రెండేళ్లలో రూ.27 కోట్లు మహిళలకు రుణాలు అందించి వ్యాపారంలో ప్రోత్సహిస్తున్నాం ఆడబిడ్డలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశాం. రాష్ట్రాన్ని దోచుకుని అప్పులపాలు చేసి పోయి కెసీఆర్ ఫామ్ హౌస్ లో పడుకున్నాడని ఎద్దేవా చేశారు.

# బీజేపీకి ఒక్కసీటు రాకుండా చేస్తాం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ఏర్పాటు చేస్తామని సోనియాగాంధీ కరీంనగర్ గడ్డపై నుంచి మాట ఇచ్చారు. ఏపీలో పార్టీ అధికారం కోల్పోయినా మాట తప్పకుండా తెలంగాణ ఇచ్చారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినా.. బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారు. ప్రజా తీర్పును కాంగ్రెస్ పార్టీ శిరసావహించింది. పదేళ్లలో పన్నుల రూపంలో రూ.20లక్షల కోట్లు ప్రజలు ప్రభుత్వానికి కట్టారు. కానీ, పదేళ్లలో పేదలకు రెండు పడక గదుల ఇళ్లు కూడా కట్టించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి. పాలమూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి భాజపా జాతీయ అధ్యక్షుడిని తీసుకొచ్చారు. కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు, మెట్రో రైలు మంజూరు చేయలేదు..మూసీకి నిధులు ఇవ్వలేదు. రీజినల్ రింగ్‌రోడ్డు పూర్తి చేస్తామని చెప్పలేదు. ఇవేమీ ఇవ్వకుండా భాజపా జాతీయ అధ్యక్షుడిని ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. దేశంలోని భాజపా నేతలందరినీ ఎన్నికల ప్రచారానికి తీసుకొచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా? కాంగ్రెస్ సత్తా ఏంటో భాజపాకు చూపిస్తాం అని రేవంత్ అన్నారు. భాజపా, బీఆర్ఎస్ బంధం ఫెవికాల్ బంధం కాదా?. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసింది. ఓట్లు, సీట్లు దానం చేసి 8 చోట్ల భాజపా ఎంపీలను గెలిపించారు. 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయినా తామే గెలుస్తామని బీఆర్ఎస్ రంకెలేస్తోంది. బీఆర్ఎస్ రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం.. మూడేళ్లలోనూ కూలేశ్వరం అయింది. కాళేశ్వరాన్ని బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని మోదీ, అమిత్ షా స్వయంగా చెప్పారు. కానీ, కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే.. ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతోనే గెలుస్తామని మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.



'ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుంది' అని వారికి స్పష్టం చేశారు. గురువారం నాడు కరీంనగర్‌లో మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఇవి కార్యకర్తల ఎన్నికలని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే పార్టీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నేతలకు ఆయన సూచించారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు రేవంత్ రెడ్డి. అయితే అధికార పార్టీలో టికెట్ ఆశించే వాళ్లు ఎక్కువగా ఉండటం సహజమని.. ఎంతో మంది పోటీ పడ్డా.. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ దక్కడం మీ అదృష్టమని అభ్యర్థులకు సోదాహరణగా వివరించారు. ఒక్క ఓటు.. గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. టికెట్ రాని వారిని కూడా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలంటూ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థలకు దిశానిర్దేశర చేశారు ముఖ్యమంత్రి. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోయినా మన ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించామని చెప్పుకొచ్చారు. పేదలకు సన్న బియ్యం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. మహిళా గ్రూపులకు సున్నా వడ్డీ రుణాలు అందించామని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతోపాటు వాటి వల్ల చేకూరిన లబ్దిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మున్సిపల్ అభ్యర్థులకు స్పష్టం చేశారు. మనం అబద్దాలు చెప్పాల్సిన పనిలేదని.. ప్రభుత్వం చేసిందే ప్రజలకు చెప్పండంటూ వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేత హతం !

**రాయపూర్,ఫిబ్రవరి 5 :** ఛత్తీస్‌ఘడ్ బీజాపూర్ జిల్లా తర్రెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్లటూన్-30 కమాండర్ ఉదమ్ సింగ్ మృతి చెందినట్లు ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. బీజాపూర్ జిల్లాలో గురువారం ఉదయం నుంచి భద్రత బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. డీఆర్‌జీ (డిస్టిక్ రిజర్వ్ గార్డు) సీఆర్పీఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. పెద్దగెల్లూరు అడవిలో మావోయిస్టులు ఉన్నారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో బలగాలు ఆ ప్రాంతంలో ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఇరు వర్గాలకు మధ్య కాల్పులు జరిగాయి. అయితే ఘటనాస్థలి నుంచి ఆటోమేటిక్ ఏకే-47 రైఫిల్‌తో పాటు పలు ఆయుధసామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.



# పన్నెండేళ్లుగా తెలంగాణలో బానిస ప్రభుత్వాలు

- పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్‌తో ఒరింగింది శూన్యం
- మజ్లిస్ కనుసన్నల్లోనే ప్రభుత్వాల పాలన
- రేంవత్ సర్కార్‌పై కిషన్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 5:** తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని ప్రజలకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు. పన్నెండు ఏళ్లుగా తెలంగాణలో బానిస ప్రభుత్వాలు నడుపుతున్నారని విమర్శించారు. మజ్లిస్ కనుసన్నల్లో బీఆర్ఎస్ పదేళ్లు బానిస పాలన చేస్తే.. కాంగ్రెస్ పార్టీ సైతం మజ్లిస్ ఓట్ల కోసం బానిస పాలన చేస్తుందంటూ మండిపడ్డారు. గురువారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ భూములను విక్రయించడం అభివృద్దా? అంటూ ఈ రెండు పార్టీల నేతలను సూటిగా ప్రశ్నించారు. మద్యం, డ్రగ్స్‌తో కుటుంబాలు పతనం అవుతున్నా.. ఈ ప్రభుత్వానికి కావాల్సింది మాత్రం ఆర్థిక వనరులేనని కేంద్ర మంత్రి అన్నారు. భూములు అమ్మాలి.. అప్పులు చేయాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. అవినీతి, దోపిడి ప్రభుత్వమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభివర్ణించారు. వీధి దీపాలు వెలిగించేందుకు డబ్బులు లేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందని వ్యంగ్యంగా అన్నారు. పని చేసే పార్టీలకే ఓటు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఐదు డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయంటూ కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ఇదా ప్రజా ప్రభుత్వమా.. పని చేసే ప్రభుత్వమా? సమాధానం చెప్పాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. పని చేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో అనేక విమానాశ్రయాలు ఉన్నాయని.. తెలంగాణలో ఎందుకు లేవని ఆయన రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీశారు. గత పదేళ్లు ఏమీ చేశారంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం.. కాంగ్రెస్ పార్టీకి బంగారు బాతు అయిందన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఇక్కడి నుంచే నగదు పంపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల బెనిఫిట్స్ మాత్రం ఇవ్వరన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఆర్ఆర్ ట్యాక్స్‌తో వ్యాపారస్తులు భయపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలకు ఎంత నగదు ఇచ్చారో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని బల్లగుద్దీ మరి ప్రశ్నించారు. ఫిక్స్‌డ్ రేట్స్.. వన్ టైమ్ పేమెంట్‌ను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పక్కగా కొనసాగిస్తుందని విమర్శించారు. గత 26 నెలల్లో ఏమీ చేసిందో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇంటి అల్లుడి ఫోన్ ట్యాపింగ్ చేసిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమీ పీకారని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బాషలో అడుగుతున్నా నన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు.

# కేసీఆర్‌పై విషం కక్కుతున్న సీఎం రేవంత్

## బూతుల ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలుస్తారు

## మాజీమంత్రి హరీష్ రావు ఘాటు విమర్శ



**హైదరాబాద్,ఫిబ్రవరి 5 :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వికృత మాటలకు సభ్య సమాజం ఛీ కొడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను జాతిపిత అన్నందుకు రేవంత్ రెడ్డి విషం కక్కుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చూస్తుంటే ఆవేదన కలుగుతోందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వరుస విమర్శలపై మాజీ మంత్రి హరీశ్ రావు గురువారం కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్‌ను జాతిపితగా తెలంగాణ సమాజం పిలుచుకుంటే రేవంత్ రెడ్డికి ఎందుకు కడుపునొప్పి అని ప్రశ్నించారు. బూతుల ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రలో మిగిలిపోతాడన్నారు. పాలన చేతకాక సీఎం రేవంత్ రెడ్డి నిరాశ నిస్పృహలో ఉన్నారని చెప్పారు. నీతి లేకుండా జాతి అని మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ వైఖరిని ఎండగట్టారు.సీఎం రేవంత్ రెడ్డి భాష, అరాచకాలపై స్పందించాలంటూ తెలంగాణ మేధావులకు ఈ సందర్భంగా హరీశ్ రావు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి అదుపు తప్పి ఎలా మాట్లాడుతున్నారో గమనించాలంటూ కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు సూచించారు. ఇలాంటి ముఖ్యమంత్రి తెలంగాణకు ఉండటం మన దౌర్భాగ్యమన్నారు. ఏడేళ్లలో ఎస్ఎల్‌బిసి టన్నెల్‌ను 11 కిలో కిలోమీటర్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో తవ్వామని.. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం వంద మీటర్లు కూడా తవ్వలేదని విమర్శించారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో శవాలు బయటకు తీసుకురాలేని దద్దమ్మ రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడితే అమరవీరుల ఆత్మ ఘోషిస్తుందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ఇచ్చారని.. అదే వేదికపై రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారని తెలిపారు. ప్రతిసారీ డైవర్షన్ చేయాలనుకుంటే ప్రజలే రేవంత్‌ని ముఖ్యమంత్రి పదవి నుంచి డైవర్షన్ చేస్తారని చెప్పారు. ప్రతి నెలకో కుంభకోణానికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ నేతలపై తీవ్ర ఆరోపణలు చేశారు హరీష్ రావు. గ్యారెంటీలు నిల్.. స్కామ్‌లు ఫుల్ అంటూ రేవంత్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తన కుర్చీని కాపాడుకోవటానికి బీజేపీతో రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ ఎంపీ సీటును బీజేపీకి రేవంత్ రెడ్డి బహుమానంగా ఇచ్చారని చెప్పారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఖాతా తెరవలేదన్నారు. పగ ప్రతీకారాలు తప్ప పాలన మీద దృష్టి లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిపై మండిపడ్డారు. రూ. 25 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఎక్కడ ఇచ్చావో ప్రెస్ క్లబ్‌లో చర్చ పెడదామా? అంటూ సీఎం రేవంత్‌కు హరీశ్ రావు సవాల్ విసిరారు. హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి వచ్చిన తర్వాత అయినా మారాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా హరీశ్ రావు హితవు పలికారు. రేవంత్ రెడ్డి మారతారన్న నమ్మకం తనకు లేదని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# తులం బంగారం వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయండి

- పదేళ్ల బీఆర్ఎస్ అభివృద్ధి.. రెండేళ్ల కాంగ్రెస్ ధోఖా పనులు
- సిరిసిల్ల ప్రచారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**రాజన్న సిరిసిల్ల,ఫిబ్రవరి5:** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన కీలక నేతలు ప్రచారంలో ఫుల్ బిజీగా ఉన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం బివైనగర్ లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ పాల్గొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారని ఆయన విమర్శించారు. 'ఓవైపు అభివృద్ధి చేసిన బీఆర్ఎస్, మరోవైపు ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్, ఎప్పుడో ఒకసారి దేవుని పేరు చెప్పుకుని వచ్చే బీజేపీ పార్టీలు ఉన్నాయి. ఎవరికి ఓటు వేయ్యాలో మీరే నిర్ణయించుకోవాలి' అని కేటీఆర్ అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పోటీ గత పదేళ్లలో ప్రజల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన బీఆర్ఎస్ పార్టీకి, గడిచిన రెండేళ్లలో ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య ఉన్నదని కేటీఆర్ చెప్పారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తేనే తగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమవుతాయని, ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికలతోనే కేసీఆర్‌నుముఖ్యమంత్రిని చేసుకునే కార్యక్రమం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ వాళ్లు తులం బంగారం ఇస్తానన్నారు. కానీ, వాళ్లు ఉన్న పుస్తెలు ఎత్తుకు పోయే రకం. నాపై కోపంతో బతుకమ్మ చీరలు బంద్ చేశారు. నేతన్నల బతుకుదెరువుపై దెబ్బ కొట్టారు. దేవుని గుడి వద్ద ఉండి అడుక్కుతినేవారిలాగా, దేవుని పేరుతో ఓట్లడుక్కోవడానికి మాత్రమే బీజేపీ వారే వస్తారు. అలానే కాంగ్రెస్ కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారు. తులం బంగారం వచ్చిన వారు కాంగ్రెస్‌కు ఓటెయ్యండి, రాని వారు బీఆర్ఎస్‌కు ఓటెయ్యండి. సిరిసిల్ల బతుకుదెరు వు లేకుండా చేసినోడికి, బుద్ధి చెప్పాలి' అని కేటీఆర్ తెలిపారు. ఇప్పటికే అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. మున్సిపల్ ఎన్నికల కోసం మరోసారి అబద్ధాలు చెబతోందని విమర్శించారు. 'ముఖ్యమంత్రికి చేతిలో అధికారం, అవకాశం ఉన్నప్పుడు మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టవలసిన అవసరం ఏమున్నది? చేతనైతే ప్రజలకు మంచి చేయాలి, ఇచ్చిన హామీలు అమలు చేయాలి. కానీ కేసీఆర్‌ను తిట్టవలసిన అవసరం ఏముంది..? ప్రతి అంశంలో అడ్డగోలుగా మాట్లాడటం, అబద్దాలు ఆడటం తప్పించి, ఈ రెండేళ్ళలో ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదు. కేసీఆర్ ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను తీసివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నది. ఈ ఎన్నికల్లో జిల్లా కేంద్రాలను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ మాటలు చూసి ఓటు వేయాలి. జిల్లాలు ఎత్తివేస్తామని చెప్పిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీకి ఓటువేస్తే అది మంచా, చెడా అన్న విషయాన్ని గుర్తించి ఓటు వేయాలని కేటీఆర్ సూచించారు.

# పవన్‌తో పొత్తుతో విషం చిమ్ముతున్న బీజేపీ

## తెలంగాణ వ్యతిరేకి పవన్ కల్యాణ్

## కాంగ్రెస్‌కు ఓటేస్తేనే అభివృద్ధి సాధ్యం: పొన్నం



**హుస్నాబాద్, ఫిబ్రవరి 5:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పొత్తుపెట్టుకుని బీజేపీ తెలంగాణపై విషం చిమ్మడాన్ని ప్రజలెవ్వరూ సహించరని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణను వ్యతిరేకించే విధానాలకు బీజేపీ పాల్పడుతుందని విమర్శించారు. ఒక వైపు తెలంగాణకు నిధులు ఇవ్వకుండా మోసం చేస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. మరోవైపు తెలంగాణ కండ్లు పడి ఆంధ్రా కొబ్బరి చెట్లు ఎండిపోయాయన్న పవన్ కళ్యాణ్ తెలంగాణలో ప్రచారం చేస్తామంటే ఎవరూ చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలను అవమానపరిచే విధంగా, వివక్షపూరితంగా మాట్లాడే వ్యక్తులతో పొత్తులు పెట్టుకుని వస్తున్న బీజేపీ ఆలోచనను తెలంగాణ మేధావులు,ప్రజలు ఆలోచించాలని కోరారు. హుస్నాబాద్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. అలాగే గత పదేళ్లలో బిఆర్ఎస్ చేసింది సున్నా అని అన్నారు.

# బీజేపీని గెలిపిస్తే దండిగా నిధులు

## ప్రచారంలో హామీలు గుప్పించిన బండి




**కరీంనగర్, ఫిబ్రవరి5:** మున్సిపాలిటీల్లో బీజేపీని గెలిపిస్తే నిధుల వరద పారిస్తానని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మున్సిపాలిటీలకు వచ్చేది కేంద్ర నిధులేనని అన్నారు. గ్రామ పంచాయతీలకు ఇప్పటికే కేంద్రం రూ.259 కోట్లు విడుదల చేసిందని, మున్సిపల్ ఎన్నికల్లో భాజపాని గెలిపిస్తే మొదటి విడతగా తెలంగాణకు రూ.500 కోట్లు తీసుకొస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. హుజూరాబాద్ సూపర్ బజార్ చౌరస్తాలో గురువారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి అభివృద్ధి పనుల కోసం రూ.వందల కోట్లు తీసుకొచ్చాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని పరికరాలు తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం సరైన సిబ్బందిని నియమించట్లేదు. గత పదేళ్ల నుంచి హుజూరాబాద్ అభివృద్ధి చెందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు అమలు నెరవేర్చిందా? ఈ ప్రభుత్వం హుజూరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఒక్కపైసా ఇవ్వలేదు. ఈ ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే ఇక్కడ మినీ స్టేడియం నిర్మిస్తాం. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అన్ని ట్యాక్సులు పెంచుతారు. మేం దిల్లీ నుంచి నిధులు తీసుకొచ్చి హుజూరాబాద్‌ను అభివృద్ధి చేయిస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.

# మేడారంలో గ్యాంగ్ రేప్ జరగలేదు

## మహిళా కమిషన్ ఎంక్వయిరీ కమిటీ





**ములుగు, ఫిబ్రవరి 5:** మేడారం జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరగలేదని జాతీయ మహిళా కమిషన్ ఎంక్వయిరీ కమిటీ తేల్చి చెప్పింది. గురువారం మధ్యాహ్నం జాతీయ మహిళా కమిషన్ సభ్యులు డెలినా, కంచన్ కట్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ములుగుకు చేరుకుంది. అనంతరం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ దివాకరం, ఎస్పీ రామ్‌నాథ్ కేకన్‌తో కమిటీ సమావేశమైంది. ఆ తర్వాత గ్యాంగ్ రేప్‌పై విచారణ చేపట్టింది. అలాగే ఈ ఘటన జరిగిందంటూ ఆరోపిస్తున్న ప్రదేశాన్ని సైతం కమిటీ సభ్యులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ జాతరలో ఎలాంటి గ్యాంగ్ రేప్ ఘటన జరగలేదని సదరు కమిటీ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. దాంతో పోలీసుల నుంచి లిఖిత పూర్వక నివేదిక వచ్చాక.. జాతీయ మహిళా కమిషన్‌కు ఈ ఎంక్వయిరీ కమిటీ.. రిపోర్టును అందించనుంది. మేడారంలో జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు సమ్మక్క-సారలమ్మ జాతర జరిగింది. ఈ జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరిగిందంటూ సోషల్ మీడియాలో వార్త వైరల్ అయింది. మామిడితోటలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పలువురు యువకులు వాష్ రూమ్‌కు వెళ్లిన బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు ప్రచారం జరిగింది. అనంతరం ఈ ఘటనకు కారణమైన యువకులు జంపన్నవాగు సమీపంలోని ఒక షాపులో దాక్కున్నారని.. వారిని పోలీసులు తీసుకువెళ్లినట్లు ఆ వార్త కథనంలో పేర్కొన్నారు. ఈ వార్తను ఇప్పటికే ములుగు ఎస్పీ రామ్‌నాథ్ సుధీర్ కేకర్ ఖండించారు. అలాంటి ఘటన ఏదీ చోటు చేసుకోలేదని స్పష్టం చేశారు. మరోవైపు ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ సీరియస్ అయింది. కమిషన్‌లోని సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ.. ములుగు వచ్చి వాస్తవ పరిస్థితులు పరిశీలించి.. కమిషన్‌కు నివేదిక అందజేయనుంది.



## సంపాదకీయం

# మోహన్‌బాబు వర్సిటీలో సినిమా తరహా శిక్షలా?

నటుడు మోహన్ బాబు విద్యాసేవ ఎలాంటిదో బట్టబయలు అయ్యింది. పైకి నీతి సూత్రాలు వల్లిస్తూ.. జలగల్లా పీక్కుతుంటున్న తీరు వెలుగుచూసింది. తను పేదలకు ఉచితగా విద్యను అందిస్తున్నానని చెబుతున్న బాంబికపు మాటలు ఉత్తవే అని తేలింది. ఇదంతా ఒక ఎత్తయితే ఇటీవల ఓ విద్యార్థి ఆత్మహత్య మరింత కలకలం రేపుతోంది. ఇక్కడి అవినీతిపై ప్రశ్నించిన విద్యార్థులను కిడ్నాప్ చేయించడం చూస్తే మోహన్‌బాబు ఆయన తనయుడు ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చు. నిజానికి కార్పోరేట్ కళాశాలల అవినీతి కథలు అనకొండలా బుసలు కొడుతున్నాయి. అనుమానాస్పద మరణాలు, ఆత్మహత్యలపై ప్రభుత్వాలు కిమ్మనడం లేదు. నయా ఆర్థిక విధానాల పుణ్యమా అని కార్పొరేట్ల చేతుల్లో చిక్కుకున్న విద్యావ్యవస్థకు ఇప్పటికే లాభార్జన ప్రధానంగా మారింది. అక్కడి నుండి తమ ఖజానాలు నింపుకోవడానికి, ఎంతటి దారుణమైనా చేసే మాఫియా ముఠాల స్థాయికి కార్పొరేట్ విద్యా వ్యవస్థ దిగజారుతున్న తీరుకు తాజా పరిణామం ఒక నిదర్శనం. ఇది ఒక్క మోహన్ బాబుకే పరిమితం కాదు. ఇప్పుడు మోహన్‌బాబు వ్యవహారం బయపడింది. గతంలో నారాయణ, శ్రీచైతన్య స్కూళ్లు, కాలేజీల్లో వందలమంది పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అనుమానాస్పద మృతి చెందారు. ఇవన్నీ బయటకు రాకపోవడానికి ఘనత వహించిన పాలకుల తీరే కారణం. ఇక మోహన్ బాబు విద్యాసంస్థల వ్యవహారానికి వస్తే..ఫీజుల దందాపై గళమిప్పిన ఎస్ఎఫ్ఐ నేతలను కిడ్నాప్ చేయడానికి తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్శిటీ యాజమాన్యం బరితెగించిన తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. బౌన్సర్లతో విద్యార్థి నేతలను బలవంతంగా ఎత్తుకుపోవడం, వారిపై అమానుషంగా దాడి చేయడం వంటి చర్యలు ఆ విశ్వవిద్యాలయంలో నేరాలు వ్యవస్థీకృతమైన తీరుకు, యాజమాన్య నేర ప్రవృత్తికి నిదర్శనాలు. సినిమాలో విలన్‌లా మోహన్ బాబు నిజజీవితంలో కూడా వ్యవహరించారన్న ఆరోపణలకు సమాధానం చెప్పుకోవాలి. విద్యాసంస్థల్లో సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేయడం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం సహజ పరిణామమే. మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో జరిగింది కూడా ఇదే! కానీ, విద్యాసంస్థ యాజమాన్యం అన్ని పరిధిలను అతిక్రమించి ప్రశ్నించిన వారిని ఎత్తుకెళ్లి, భౌతికదాడులు చేసి, అంతం చేసేలా వ్యవహరించడం ఖచ్చితంగా బరితెగింపునకు నిదర్శనం. సొంత జిల్లాలో ఇంతటి దారుణం జరిగినా సిఎం చంద్రబాబు ఇప్పటి వరకు నోరు మెదపలేదు. దీనిగురించి ఆరా తీయలేదు. మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఫీజుల దందాపై దుమారం రేగడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ అధిక ఫీజుల వసూలు, నిబంధనల ఉల్లంఘనలపై ఆరోపణలు వచ్చాయి. రకరకాల పేర్లతో సాగిన ఫీజుల దందా శృతి మించడంతో నియంత్రణ సంస్థల జోక్యం, కోర్టుల దాకా ఈ వివాదాలు వెళ్ళాయి. దాదాపు 26 కోట్ల రూపాయలను యాజమాన్యం అక్రమంగా వసూళ్లు చేసినట్లు ఉన్నత విద్యామండలి నిర్ధారించింది. అక్రమ వసూళ్లకు పాల్పడటంతో 15 కోట్ల రూపాయల జరిమానాను ఉన్నత విద్యామండలి విధించింది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ కష్టార్జితాన్ని వెనక్కి తీసుకోవడానికి పోరాటం కొనసాగించారు. మరోసారి ఉన్నత విద్యామండలిని ఆశ్రయించారు. ఇది యాజమాన్యానికి నచ్చలేదు. యూనివర్శిటీ ప్రాంగణానికి వారిని పిలిపించి మోహన్‌బాబు కుమారుడు మంచు విష్ణు బౌన్సర్లతో దాడి చేయించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ విద్యార్థి సమస్యలపై పోరాటాలు చేసే విద్యార్థి సంఘాలు సహజంగానే ఈ దౌర్జన్యంపై దృష్టి సారించింది. విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో ఆందోళన చేపట్టింది, ఇది నచ్చని మోహన్‌బాబు యూనివర్శిటీ యాజమాన్యం విద్యార్థులను బెదిరించడానికి మాఫియా అవతారమెత్తి కిడ్నాప్‌లకు, దాడులకు దిగడం అమానుషం. వివాదం ప్రారంభమైన వెంటనే యాజమాన్యం సంయమనం పాటించి, విద్యార్థులతోనూ, వారి తల్లిదండ్రుల తోనూ చర్చించి ఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదు. బయటకు నీతి వాక్యాలు చెప్పే మోహన్ బాబు తన యూనివర్సిటీలో ఇలాంటివి జరగకుండా చూసుకోవాల్సింది. కానీ ఆయనకూడా మైనంగా ఉండడం చూస్తుంటే ఇదంతా తెలిసీ చేస్తున్నారనే ప్రచారం సాగింది. విద్యార్థుల నిరసనను అణచివేయాలన్న దృష్టిలో దాష్టీకాలకు తెగించడం సరికాదు. విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రశ్నించడం, నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య హక్కు. నా యూనివర్ఇసటీ ఇది అని చెప్పడానిక కుదరదు. తాజా వ్యవహారంలో వెంటనే పోలీసులు స్పందించిన తీరు ప్రశంసనీయం. తక్షణమే వారు స్పందించకుంటే బౌన్సర్ల నిర్బంధంలో ఉన్న విద్యార్థి నేతల పరిస్థితి మరింత ఘోరంగా మారి ఉండేది. ఈ వ్యవహారంలో ఇప్పటికే విశ్వవిద్యాలయ పిఆర్ఓ సతీష్, మోహన్‌బాబు, మంచు విష్ణులపై కేసులు నమోదయ్యాయి. విచారణ పక్రియను వేగంగా పూర్తి చేసి, కిడ్నాపర్లు, వారి వెనుక వున్న వారిని కఠినంగా శిక్షించాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్న మోహన్‌బాబు యూనివర్శిటీని బ్లాక్ లిస్టులో పెట్టాలి. వారి తల్లిదండ్రుల నుండి అక్రమంగా వసూలు చేసిన కోట్లాది రూపాయల మొత్తాన్ని వెనక్కి ఇప్పించాలి. విద్యా సంస్థలు మాఫియా ముఠాలుగా మారకుండా, సామాజిక బాధ్యతతో పని చేసేలా, ఫీజులు, సదుపాయాలు, భద్రత వంటి అంశాల్లో అత్యంత పారదర్శకంగా వ్యవహరించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! అందుకు చంద్రబాబు ప్రభుత్వం తక్షణం పూనుకోవాలి. విద్యార్థులకు అండగా ఉన్నామని నిరూపించాలి.



# వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం పరుగులు

- రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్
- ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది
- 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నాం
- ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణల అమలు
- దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదు
- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్..
- కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు.. ఓట్ బ్యాంక్ రాజకీయాలు
- రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో మోడీ
- విపక్షాల నిరసనలు.. నినాదాలు.. చివరకు వాకౌట్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 5 :** వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నాయని అన్నారు. సరైన దిశలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. విపక్ష నేతల నిరసనలు, నినాదాల నడుమ ప్రధాని ప్రసంగించారు. ఆ తరువాత కొద్ది సేపటికే విపక్షాలు వాకౌట్ చేశాయి. అయితే, ప్రధాని మాత్రం తన ప్రసంగాన్ని కొనసాగించారు. స్వాతంత్య్రం తొలి నాళ్లల్లో భారత్ ప్రపంచంలో 6వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని అన్నారు. కానీ, మునుపటి ప్రభుత్వాల విధానాల కారణంగా 2014 నాటికి 11వ స్థానికి పడిపోయిందని అన్నారు. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోందని అన్నారు. ఈయూ సహా 27 దేశాలతో భారత్ అనేక ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నామని చెప్పారు. రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్ సాగుతోందని అన్నారు. ఉత్పత్తి రంగంలో అనేక విజయాలు సాధించామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. భారత్‌లో ప్రతిభావంతమైన యువతకు కొరత లేదని వ్యాఖ్యానించారు. రానున్న 25 ఏళ్లు భారత్‌కు అత్యంక కీలకమని వ్యాఖ్యానించారు. దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదని కూడా తేల్చి చెప్పారు. ఒకప్పుడు భారత్ బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండేదని అన్నారు. ప్రస్తుతం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోందని చెప్పారు. ప్రపంచ సవాళ్లకు భారత్ పరిష్కారాలు చూపించే స్థితిలో నిలిచి ఒక ఆశాకిరణంగా మారిందని అన్నారు. అధిక వృద్ధి రేటు, తక్కువ ద్రవ్యోల్బణం కలగలిసిన అరుదైన స్థితిలో భారత్ ఉందని అన్నారు. మునుపటి ప్రభుత్వాల తప్పులను సరిచేసేందుకే అధిక శాతం తమ శక్తియుక్తులను వినియోగించాల్సి వస్తోందని అన్నారు. గత ప్రభుత్వాల కారణంగా మూటగట్టుకున్న ప్రతికూల అభిప్రాయాన్ని తొలగించుకుంటున్నామని అన్నారు. ఈ నష్టాన్ని సరిచేసేలా భవిష్యత్తుకు తగిన విధానాలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గ్లోబల్ సౌత్‌గా పేరు పడ్డ దేశాల తరపున భారత్ అంతర్జాతీయ వేదికలపై బలంగా తన వాణిని వినిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచదేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా భారత్ అవతరించిందని చెప్పారు. కాంగ్రెస్‌కు దార్శనికత లేదని విమర్శించారు. ఫలితంగా భారత్ చాలా కాలం పాటు కష్టాలు పడిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా వ్యవస్థలు బలహీనపడతాయని అన్నారు. ప్రపంచంలో అగ్రగామి దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాల కోసం ఉత్సుకతతో ఉన్నాయని చెప్పారు. ఈయూ ట్రేడ్ డీల్‌తో ప్రపంచంలో స్థిరత్వంపై వివిధ దేశాలకు నమ్మకం పెరిగిందని అన్నారు. అమెరికాతో ఒప్పందంతో ఈ భావన మరింత బలపడిందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్‌పై ప్రధాని మోదీతీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. తనతోపాటు ఓ వర్గంపైనా ద్వేషాన్ని పెంచుకుంటోం దన్నారు. ఇటీవల లోక్‌సభలో చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ.. దీనిపై లోక్‌సభలో చర్చ జరగకపోవడం అత్యున్నత పదవికే అవమానకరమన్నారు. దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు. దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. యూపీఏ హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉంటే.. ఎన్డీయే హయాంలో మూడో స్థానానికి చేరుకోనుంది. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది. గతంలో మనతో ఒప్పందానికి పలు దేశాలు ముందుకొచ్చేవి కావు. ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. భారత్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి లేదు. తయారీ రంగంలో బలమైన ఎకో సిస్టమ్ ఉంటేనే ఒప్పందాలకు ముందుకొస్తారు. రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్.. నినాదంతో దూసుకెళ్తున్నాం. అన్ని విషయాల్లో పోటీ పడేందుకు భారత్ ఇప్పుడు సిద్ధంగా ఉంది. అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. మనదగ్గర యువత జనాభా అధికంగా ఉంది. మన యువతకు ప్రపంచ దేశాలన్నీ స్వాగతం పలుకుతున్నాయి. బ్యాంకుల బలోపేతానికి అనేక సంస్కరణలు తెచ్చాం. ప్రభుత్వ రంగ సంస్థలకు అండగా నిలిచాం. బ్యాంకుల నుంచి ఇప్పుడు పేదలకు రుణాలు అందుతున్నాయి. ముద్ర యోజన ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. దీని కింద రూ.30లక్షల కోట్ల రుణాలు ఇచ్చాం. 10కోట్ల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ది పొందారు. 2014 తర్వాత ఎ÷-లానింగ్ కమిషన్‌ను తీసేసి నీతిఆయోగ్‌ను తెచ్చాం. ఇది వేగంగా, సమర్థంగా పనిచేస్తోంది. అక్రమార్కులను రక్షించేందుకు బెంగాల్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయిస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు కూడా అక్రమ వలసదారులను బయటకు పంపించివేస్తున్నాయి. బెంగాల్‌లో మాత్రం అటువంటి వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజల హక్కులు హరిస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# మేఘాలయ బొగ్గుగనిలో పేలుడు

## పేలుడు ఘటనలో 16 మంది దుర్మరణం

**షిల్లాంగ్,ఫిబ్రవరి 5 :** మేఘాలయ రాష్ట్రంలో అక్రమ బొగ్గ తవ్వకాలు మరోసారి భారీ ప్రాణ నష్టానికి కారణమయ్యాయి. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలోని ఓ గనిలో బొగ్గ తవ్వుతుండగా భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి 16 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, రెస్క్యూ టీమ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ గనిని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే పేలుడికి గల కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. మేఘాలయలో ర్యాట్ హోల్ మైనింగ్, అశాస్త్రీయ పద్ధతుల్లో తవ్వకాలు జరుపుతున్నారు. అయితే, ఈ తవ్వకాలను 2014 నుంచి జాతీయ హరిత ట్రైబ్యునల్ నిషేధించింది. ర్యాట్ హోల్ అంటే.. సమాంతరంగా సన్నని గుంత తవ్వుతూ బొగ్గును బయటకు వెలికి తీసే పద్ధతి. సుమారు 3, 4 అడుగుల వెడల్పుతో ఈ గుంతలు ఉంటాయి. అచ్చం ఎలుకలు బొరియలు తవ్వినట్టుగా ఉంటాయి కాబట్టి దీనికి 'ర్యాట్ హోల్ మైనింగ్' అనే పేరు వచ్చింది. ఇటీవల ఈ తవ్వకాలపై ఎన్జీటీ నిషేధాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది.



# అందుబాటులోకి భారత్ ట్యాక్సీ

## యాప్‌ను ప్రారంభించిన అమిత్ షా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్రమంత్రి అమిత్ షా గురువారం ఈ యాప్‌ను ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన సేవలు విజయవంతమైన నేపథ్యంలో ఎట్టకేలకు అందుబాటులోకి తెచ్చారు. తొలుత దిల్లీ-రాజధాని ప్రాంతం, గుజరాత్ రాష్ట్రాల్లో సేవలు లభిస్తాయి. రాబోయే మూడేళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య వరకు భారత్ ట్యాక్సీ సేవలను తీసుకొస్తామని అమిత్‌షా పేర్కొన్నారు. ఇందులో లాభాలు డ్రైవర్లకే వెళతాయని చెప్పారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కార్లు, త్రీవీలర్లు, టూవీలర్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దేశంలో క్యాబ్ బుకింగ్ సేవల్లో ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి సంస్థలు కీలక భూమిక పోషిస్తున్నాయి. డ్రైవర్ల నుంచి ఆయా సంస్థలు కొంతమొత్తం కమిషన్‌గా వసూలు చేస్తున్నాయి. వారి శ్రమను ఆయా కంపెనీలు దోచుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మల్టీ స్టేట్ కోపరేటివ్ సొసైటీస్ యాక్ట్ కింద 2025 జూన్ 5న 'భారత్ ట్యాక్సీ'కి కేంద్రం రూపకల్పన చేసింది.




జీరో కమిషన్, సర్జ్‌ప్రైసింగ్ లేని విధానం, డ్రైవర్లకు లాభాలు పంచిపెట్టడం దీని ముఖ్య ఉద్దేశం. దిల్లీ-ఎన్‌సీఆర్, గుజరాత్‌లో డిసెంబర్ 2 నుంచి ప్రయోగాత్మకంగా సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు 3 లక్షల డ్రైవర్లు ఇందులో చేరగా.. లక్ష మంది యూజర్లు రిజిస్టర్ అయ్యారు. రోజుకు 10 వేల రైడ్లు జరిగాయి. సుమారు రూ.10 కోట్లను డ్రైవర్లకు లాభాలుగా అందించనట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పేర్కొంది. డ్రైవర్లకు 'సారథి' పేరిట ఆరోగ్య, ప్రమాద బీమా, రిటైర్మెంట్ సేవింగ్స్ కూడా లభిస్తాయి.

# భారత్‌కు అమెరికా బంపరాఫర్

**ఢిల్లీ:** భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజాగా అమెరికాతో జరిగిన ట్రేడ్ డీల్‌లో రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను నిలిపివేసేలా ఒప్పందం కుదుర్చుకుంది. ప్రతిఫలంగా అమెరికా.. భారత్‌కు విధించే ప్రతీకార పన్నును 18 శాతం తగ్గించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందంపై ఇరు దేశాల ప్రతినిధులు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేయనున్నారు. అదే సమయంలో అమెరికా నుంచి భారత్ సైతం 500 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం, సాంకేతిక ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రకటనపై వాణిజ్య మంత్రి



పీయూష్ గోయల్ సైతం స్పష్టత ఇచ్చారు. సీనియర్ అమెరికా అధికారులు వచ్చే వారం ఢిల్లీలో ఒప్పందంపై సంతకం చేయడానికి రానున్నట్లు చెప్పారు. కాగా, ఈ ఫిబ్రవరి 3న భారత్‌ఉఅమెరికా వాణిజ్య ఒప్పందం తుది రూపం దాల్చింది. ఈ ఒప్పందం ద్వారా అమెరికా భారతీయ వస్తువులపై విధిస్తున్న సుంకాలను 50శాతం నుంచి 18శాతానికి తగ్గించింది. ఇది రెండు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించి, భారత ఎగుమతులకు కొత్త అవకాశాలు కలిగేందుకు దోహదం చేయనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




# 'రెబల్' రాజకీయ భూకంపం!

- కోరుట్ల-మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో..
- ధనబలానికి వ్యతిరేకంగా కార్యకర్తల 'యుద్ధం'.?
- టికెట్ నిరాకరణతో రగిలిన ఆత్మగౌరవ రాజకీయ పోరాటం

దశాబ్దాలుగా పార్టీ జెండాను భుజాన మోసుకుంటూ, ఎండనకా వాననకా ప్రజల మధ్యే జీవితం గడిపిన నాయకుడికి టికెట్ నిరాకరించడమంటే అది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన అన్యాయం కాదు. ఆ నాయకుడి వెనుక నడిచిన వందలాది కార్యకర్తల ఆత్మగౌరవాన్ని తాకిన రాజకీయ గాయం. అందుకే కోరుట్ల - మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో మొదలైన ఈ 'రెబల్' విస్ఫోటనం, సాధారణ అసంతృప్తిగా కాకుండా ఒక యుద్ధంలా రూపాంతరం చెందుతోంది.

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

### టికెట్ రాజకీయాలు రగిలిన కార్యకర్తల మనసులు

పార్టీలకు అసలు బలం కిందిస్థాయి కార్యకర్తలే. కానీ అదే కార్యకర్తలను విస్మరించి, దశాబ్దాలుగా పార్టీకి సేవ చేసిన నాయకత్వాన్ని పక్కన పెట్టి, కేవలం ధనబలం, 'విన్-ఎబిలిటీ' పేరుతో టికెట్లు కేటాయించడంపై తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. ఈ అసహనమే ఇప్పుడు రెబల్ రాజకీయంగా బయటపడుతోంది. ఇది ఒకరి వ్యక్తిగత తిరుగుబాటు కాదు కార్యకర్తల సమూహ ఆవేదనకు ప్రతిరూపం.



### స్థానిక ఎన్నికల్లో ఓటు విలువ ఎంత కీలకం..?

స్థానిక సంస్థల ఎన్నికలు గానీ, మున్సిపల్ ఎన్నికలు గానీ.. ఇక్కడ భారీ మెజార్టీలు చాలా అరుదు. ఎవరు గెలిచినా సాధారణంగా 50 నుంచి 100 ఓట్ల తేడాతోనే విజయం సాధిస్తారు. ఒక వార్డులో సగటున 1,500 ఓట్లు ఉన్నాయనుకుంటే, రెబల్ అభ్యర్థి చీల్చే 150 నుంచి 200 ఓట్లైనా అధికారిక అభ్యర్థి గెలుపు-ఓటముల మధ్య గీతను చెరిపేసే స్థాయిలో ప్రభావం చూపిస్తాయి.



### డబ్బుతో టికెట్ ప్రజలతో బంధం సాధ్యమా..?

డబ్బుతో టికెట్ సాధించవచ్చు. ప్రచారానికి వాహనాలు పెట్టవచ్చు. బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్స్‌తో ఊరంతా నింపవచ్చు. కానీ ప్రజల గుండెల్లో చోటు సంపాదించడం అంత సులభం కాదు. 'ప్రచార ఆర్భాటం' ఓటర్లను క్షణికంగా ఆకర్షించవచ్చు గానీ కష్టసుఖాల్లో తోడుండే స్థానిక నాయకత్వంపైనే ప్రజలు చివరికి నమ్మకం ఉంచుతారు. ఈ వాస్తవం కోరుట్ల - మెట్‌పల్లిలో మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

### రెబల్ ప్రభావం ఫీల్డ్ లెవల్‌లోనే స్పష్టత

పార్టీకి వెన్నెముకలుగా ఉన్న కార్యకర్తలు రెబల్ వైపు మొగ్గు చూపితే, అధికారిక అభ్యర్థికి క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడం కత్తిమీద సామే అవుతుంది. సభలు, ర్యాలీలు, ప్రచార ఆర్భాటం కనిపించినా ఇంటింటి ప్రచారం, పోలింగ్ రోజు ఓటర్లను తీసుకొచ్చే వ్యవస్థ కుదరదు. ఫలితంగా పార్టీ అభ్యర్థి ఒంటరిగా నిలబడే పరిస్థితి ఏర్పడుతుంది.

### కోరుట్ల - మెట్‌పల్లి.. ఇతర నియోజకవర్గాలకు హెచ్చరిక.!

కోరుట్ల - మెట్‌పల్లిలో ఏర్పడిన ఈ రాజకీయ పరిస్థితి, ఇతర మున్సిపాలిటీలకు ఒక పాఠంలా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. 100 ఓట్లలోపు తేడా ఉండే చోట, రెబల్ అభ్యర్థి 'కింగ్ మేకర్' కాకపోయినా కచ్చితంగా 'గేమ్ ఛేంజర్' అవుతాడన్నది నిర్ధారిత రాజకీయ సత్యం. ఈ 'రెబల్ రాజకీయ భూకంపం' ఎవరి విజయానికో, ఓటమికో మాత్రమే పరిమితం కాదు. ఇది పార్టీలు కార్యకర్తలను ఎలా గౌరవించాలి, స్థానిక నాయకత్వానికి ఎంత విలువ ఇవ్వాలి అన్న ప్రశ్నను మరోసారి రాజకీయ అజెండాగా మారుస్తోంది. కోరుట్ల - మెట్ పల్లిలో మొదలైన ఈ యుద్ధం, రేపటి రాజకీయ దిశను మార్చే సూచనలివ్వడం ఖాయం.

### కార్యకర్తల విస్మరణ.. పార్టీ భవిష్యత్తుకు ముప్పేనా..?

కిందిస్థాయి కార్యకర్తలను విస్మరించి, కేవలం గెలిచే సామర్థ్య ఉందనే కారణంతో ధనవంతులకు పెద్దపీట వేస్తే భవిష్యత్తులో పార్టీ నిర్మాణమే కూలిపోయే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ రోజు రెబల్ అభ్యర్థిగా బయటపడిన అసంతృప్తి, రేపు పెద్ద స్థాయి విభజనలకు దారి తీస్తుందా అన్న చర్చ జోరుగా సాగుతోంది.

---

# వాడవాడన 'కాషాయ కళ'!

- కోరుట్లలో ఊపందుకున్న బీజేపీ ప్రచారం
- తీవ్ర పోటీ నేపథ్యంలో పార్టీల వ్యూహాలు
- ఇంటింటికి వెళ్లి ఓటేయమని అభ్యర్థన
- 15 ఏళ్ల కష్టం ఫలించే అవకాశం
- జెండా ఎగరేసే ఉత్సాహంలో బీజేపీ శ్రేణులు




తెలంగాణలో-2026 మున్సిపల్ ఎన్నికలు హాట్‌హాట్‌గా సాగుతున్న నేపథ్యంలో, జగిత్యాల జిల్లాలోని కోరుట్ల పురపాలక సంఘంలో బీజేపీ ప్రచారం ఊపందుకుంది. నామినేషన్లు పూర్తయిన తర్వాత బీ-ఫాం (అభ్యర్థిత్వ ఆమోదం) సాధించిన బీజేపీ అభ్యర్థులు వార్డుల్లో దూసుకుపోతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో టికెట్లు దక్కని వారి అసంతృప్తి, బీఆర్ఎస్ అభ్యర్థులు ఇంకా పూర్తిస్థాయి ప్రచారంలోకి రాకపోవడంతో బీజేపీ అందరికంటే ముందుంది.

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)







### కోరుట్ల 33 వార్డుల్లో 150 మంది పోటీ

కోరుట్ల మున్సిపాలిటీలోని 33 వార్డులకు మొత్తం 190 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, మంగళవారం రోజున 34 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. పార్టీల వారీగా కాంగ్రెస్ పార్టీ నుంచి 16 మంది, బీజేపీ నుంచి 8 మంది, స్వతంత్ర అభ్యర్థులు 6 మంది, బీఆర్ఎస్ పార్టీ నుంచి 4 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఇప్పటివరకు మొత్తం 40 మంది అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోగా, ప్రస్తుతం 150 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు.



### బీజేపీ ప్రచార జోరు

నామినేషన్ల గడువు జనవరి 30న ముగిసిన తర్వాత, ఫిబ్రవరి 3 వరకు ఉపసంహరణలు పూర్తయ్యాయి. కోరుట్లలో 33 వార్డులకు సంబంధించి పలు పార్టీల నుంచి భారీగా నామినేషన్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థులు బీ-ఫాం దక్కించుకున్న వెంటనే వార్డు స్థాయిలో ప్రచారం ప్రారంభించారు. వీరు ఇతరుల కంటే ముందుగా రంగంలోకి దిగడంతో ప్రజల మధ్య బీజేపీ గుర్తు బలంగా నిలిచింది.

### బీజేపీ అభ్యర్థుల ఆత్మవిశ్వాసం

బీజేపీ అభ్యర్థులు టికెట్లు సాధించిన వెంటనే వార్డుల్లో డోర్-టు-డోర్ క్యాంపెయిన్‌లతో ఊపందుకున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, టికెట్లు దక్కని అభ్యర్థుల శాపనార్థాలు, అసంతృప్తి బీజేపీకి లాభదాయకంగా మారనుందని జనాలు ముచ్చటించుకుంటున్నారు. బీజేపీ నేతలు "పట్టణాభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం" అంటూ ప్రజలను ఆకర్షిస్తున్నారు.

### కాంగ్రెస్ అసంతృప్తి-టికెట్ల లొల్లి పార్టీకి తీవ్ర నష్టం.?

అధికార కాంగ్రెస్ పార్టీలో టికెట్ల పంపిణీ వివాదాస్పదంగా మారింది. జగిత్యాల జిల్లాలోని మున్సిపాలిటీల్లో బీ-ఫాం దక్కని అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు పార్టీని వీడి ఇతర పార్టీల్లో చేరారు. మరికొందరు స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు. ఇది కాంగ్రెస్ ఓటు బ్యాంకును చీల్చే అవకాశం ఉందంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో మాజీ నాయకుల వర్గాల మధ్య టికెట్ల కోసం తీవ్ర పోటీ జరిగింది. దీంతో అసంతృప్తులు బీజేపీ వైపు కొందరు బీఆర్ఎస్ వైపు మరికొందరు మొగ్గు చూపారు. ఇది అధికార పార్టీకి పెద్ద సవాలుగా మారింది.

### బీఆర్ఎస్ ముందుగానే ప్రారంభించినా?

కాంగ్రెస్ పార్టీ.. బిజెపిలు టికెట్ల వేటలోనే ఉన్నప్పుడే.. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తన బీఆర్ఎస్ అభ్యర్థుల తరపున ప్రచారం మొదలెట్టినప్పటికీ, పూర్తిస్థాయిలో రంగంలోకి దిగలేదు. బీఆర్ఎస్ మూడవ స్థానంలో ఉన్నప్పటికీ, పూర్తి జోరు ఇంకా రావాల్సి ఉంది. బీఆర్ఎస్ నేతలు పట్టణాభివృద్ధి, స్థానిక సమస్యలపై దృష్టి పెడుతున్నారు. అయితే బీజేపీ ముందుండటంతో బీఆర్ఎస్ తమ ప్రచారాన్ని త్వరగా ఊపందుకునేలా చూడాల్సి ఉంది.

### కార్యకర్తల కష్టం.. నేతల వ్యూహాలు ఫలించే అవకాశం!

బీజేపీ సీనియర్ నేతలు..కార్యకర్తలు కలిసి వ్యూహాత్మకంగా తమ జోరును ఇంటింటికీ తీసుకెళ్లగలిగితే తమ ఓటు బ్యాంకుకు తోడు అదనపు తటస్థ ఓట్లనూ తమ బాక్సుల్లో వేసుకోవచ్చుంటున్నారు. దీంతో పెద్దల సూచనల మేరకు అభ్యర్థులు వాడవాడలా తమ ప్రచారాన్ని ఉధృతం చేశారు. పాత కొత్త వారందరినీ కలుపుకునిపోతున్నారు. ఒక పథకం ప్రకారం బిజెపి మిగితా అన్ని పార్టీలకంటే ప్రచారంలో ముందంజలో ఉంది. కోరుట్ల మున్సిపాలిటీలో 33 వార్డులకు ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. బీజేపీ ప్రచార జోరు, కాంగ్రెస్ అసంతృప్తి, బీఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకత్వలేమి ఉన్నప్పటికీ ఈ ఎన్నికలు తీవ్ర పోటీగా మారాయి. ప్రజలు స్థానిక సమస్యల ఆధారంగా ఓటు వేసే అవకాశం ఉంది. బిజెపి ఇదే ఊపు చివరి వరకు కొనసాగిస్తే 15-16 సీట్లు సాధించి మున్సిపాలిటీపై జెండా ఎగరేసే అవకాశం ఉంటుందని పట్టణంలో ప్రచారం జరుగుతోంది.



# రైతుల భూమికి హద్దులతో భూఆధార్

**నేటి సాక్షి, నారాయణపేట:** భూములకు ఆధునిక సాంకేతికతో కచ్చితమైన హద్దులు, నిర్దిష్టమైన కొలతలు నిర్ణయించి రైతులకు భూ ఆధార్ ఇచ్చేందుకు ప్రభుత్వం భూముల రీ సర్వే చేపట్టిందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఇప్పటి వరకు గ్రామ పటాలు లేని సమస్యాత్మక గ్రామాలను గుర్తించి రీ సర్వే చేయాల్సి ఉంటుందని, ఆధునిక సాంకేతిక పరికరాలతో భూమి సరిహద్దులు, కమతాలకు నిర్దిష్టమైన కొలతలు నిర్దేశించడం జరుగుతుందని ఆమె తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లాలో గుర్తించిన మూడు గ్రామాలలో రీ సర్వే కు సంబంధించి ఏ డీ సర్వే ల్యాండ్,తహసీల్దార్లు, సర్వేయర్లతో కలెక్టర్ సన్నాహాక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ వివాదాలు పెరగడంతో రైతుల భూములకు నిర్దిష్టమైన కొలతలు చేసి భూ ఆధార్ ఇవ్వడం వల్ల వాటికి చెక్ పెట్టవచ్చని ప్రభుత్వం ఈ భూముల రీ సర్వే ను ప్రారంభించినట్లు ఆమె పేర్కొన్నారు. రీ సర్వే లో భాగంగా జిల్లాలోని నారాయణపేట మండలం శేర్నపల్లి, నర్వ మండలంలోని జంగం రెడ్డి పల్లి, కొత్తపల్లి గ్రామాలను ఎంపిక చేసిందని చెప్పారు. ఎంపిక చేసిన శేర్నపల్లి గ్రామంలో 1567 ఎకరాలు, జంగం రెడ్డి పల్లి లో 1500 ఎకరాలు, కొత్తపల్లి గ్రామంలో 1167 ఎకరాల పూర్తి విస్తీర్ణం లో రీ సర్వే చేసి ఆయా గ్రామాలకు సరిహద్దులు ఏ శివార్లు, ప్రభుత్వ భూములు, రోడ్లు, భవనాలు,అటవీ, దేవాదాయ, శిఖం భూములను గుర్తించి పూర్తి స్థాయి మ్యాపులను రూపొందించాల్సి ఉంటుం దన్నారు. అయితే రీ సర్వే కంటే ముందు రోజు ఆయా గ్రామంలో టామ్ టామ్ వేయించాలన్నారు.ఆయా గ్రామాలలో గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజలకు రీ సర్వే గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచిం చారు.పంచాయతీ కార్యాలయాల్లో పట్టదారుల వివరాల ప్రదర్శించాలన్నారు. సర్వేలో మొదట భూములకు సరిహద్దులు నిర్ధారించి పహాణి ప్రకారం పట్టాదారులు, అనుభవదారుల సమక్షంలో ప్రతి భూమికి సరిహద్దులు, అక్షాశీశాలు, రేఖాంశాలను గుర్తిస్తారని ఆమె తెలిపారు.శుక్రవారం నుంచి ఎంపిక చేసిన ఆయా గ్రామాల్లో రీ సర్వే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్ నాయక్,సర్వే ల్యాండ్ ఏ.డీ. వేణు గోపాల్, కోస్గి తహసిల్దార్ బక్క శ్రీనివాస్, నారాయణ పేట తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, సర్వేయర్లు పాల్గొన్నారు.




# ఆధునిక పంటల సాగుకు రైతులను అధికారులు ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

**నేటి సాక్షి, నిర్మల్ :**ఆధునిక పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గురువారం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు వ్యవసాయం లాభసాటిగా మార్చేలా అధికారులు చేయూతను ఇవ్వాలని అన్నారు. పంట మార్పిడి విధానం రైతులకు అలవాటు చేయాలని తెలిపారు. సహజ ఎరువుల వాడకం పెంచేలా కృషి చేయాలని చెప్పారు. అవసరాన్ని బట్టి భూసార పరీక్షలు నిర్వహిస్తూ, మోతాదుకు మించిన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని వివరించారు. ప్రస్తుత కాలంలో సేంద్రీయ పంట ఉత్పత్తుల డిమాండ్, ప్రాముఖ్యత, లాభాలు, సాగు మెలుకువలు, అధికారులు రైతులకు వివరించి, ప్రోత్సహించాలని సూచించారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ కింద నిర్దేశించిన అన్ని లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. రైతులందరికీ ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలు తప్పనిసరిగా అందించాలని వివరించారు. క్షేత్ర స్థాయిలో మండల వ్యవసాయ అధికారులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని చెప్పారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం మరింత పెంచాలని తెలిపారు. ఆయిల్ పామ్ పంటల సాగుతో రైతులు తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చునని, అలాగే ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాల విషయాలు రైతులకు తెలియజెప్పి, ఆయిల్ పామ్ పంట విస్తీర్ణం పెంచాలని అన్నారు. దీనితో పాటుగా రైతులకు అధిక లాభసాటిగా ఉండే ఉద్యాన పంటలైన పండ్లు, కూరగాయలు, పూల పంటల విస్తారం పెంచే విధంగా అధికారులు చొరవ చూపాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఎడిఎ లు విద్యాసాగర్, శ్రీనివాస రాజు, సుజాత, వీణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

- పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు కట్టుబడి ఉండాలి
- జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి రాజార్షి షా




**నేటి సాక్షి, ఆదిలాబాద్:** మున్సిపల్ ఎన్నికల విధుల్లో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అలసత్వం వహించినా సహించబోమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజార్షి షా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆదిలాబాద్ మున్సిపాలిటీకి జరగనున్న రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో గురువారం జడ్పీ కాన్ఫరెన్స్ హాల్లో మైక్రో అబ్జర్వర్లు, జోనల్ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్లు, జోనల్ అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతి అధికారి ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ కేంద్రాల్లో తలెత్తే సమస్యలను తక్షణమే పరిష్కరించేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఎన్నికల పరిశీలకులు హనుమంతు నాయక్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే అధికారులు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ నివేదికలు అందజేయాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ ఎన్నికల నియమావళి, ఈవీఎంల నిర్వహణ, పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జి. రాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

**మాజీ ఎంపీ వినోద్ కుమార్**

**బీఆర్ఎస్ అభ్యర్థి కంజర్ల రేణుకను గెలిపించాలని పిలుపు**

**నేటి సాక్షి, కరీంనగర్:** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ 13వ డివిజన్ బీఆర్ఎస్ అభ్యర్థి కంజర్ల రేణుకకు మద్దతుగా మాజీ ఎంపీ వినోద్ కుమార్ గురువారం ప్రచారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు వీధుల్లో పర్యటించిన ఆయన, కారు గుర్తుకు ఓటు వేసి రేణుకను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నో అవమానాలు, అడ్డంకులను ఎదుర్కొని కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా, అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలిపారని కొనియాడారు. రైతుబంధు వంటి పథకాలతో దేశ చరిత్రలోనే తెలంగాణ సంక్షేమానికి మారుపేరుగా నిలిచిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఆ పార్టీ పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. "మహిళలకు నెలకు రూ. 2500, తులం బంగారం, నిరుద్యోగ భృతి, రైతు భరోసా, పూర్తిస్థాయి రుణమాఫీ వంటి ఆకర్షణీయమైన హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక ప్రజలను నిరాశకు గురిచేశారు" అని మండిపడ్డారు. కరీంనగర్ పట్టణంలో జరిగిన అభివృద్ధి అంతా బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందని, ఆ పనులే తమ అభ్యర్థులను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# కలెక్టర్, అబ్జర్వర్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



**నేటి సాక్షి, సంగారెడ్డి:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య, జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్ సమక్షంలో గురువారం నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న సంగారెడ్డి, సదాశివపేట, కోహిర్, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ - జోగిపేట్, ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల, గడ్డపోతారం, జిన్నారంమున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, డిఇఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి

- శంకర్ పల్లీ మున్సిపాలిటీ లో ఎన్నికల ప్రచారంలో మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి తో పాటుగా
- పాల్గొన్న చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్
- పలు వార్డులలో ఎన్నికల ప్రచారం
- హాజరైన చేవెళ్ళ మాజీ ఎంపీ శ్రీ గడ్డం రంజిత్ రెడ్డి



**నేటి సాక్షి, చేవెళ్ల:** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ శంకర్ పల్లీ మున్సిపల్ పరిధిలో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శుక్రవారం శంకర్ పల్లి మున్సిపాలిటీలోని పలు వార్డు లలో వారు విస్తృతంగా పర్యటించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున ఓట్లు అభ్యర్థించారు.వార్డులలోని ప్రతి గల్లీలో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి , కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని సూచించారు. ఆయా వార్డు లలో కాంగ్రెస్ అభ్యర్థుల ను 'చేయి' గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. వార్డులను ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యతను తాము తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం రాష్ట్ర నాయకులు ఉదయ్ మోహన్ రెడ్డి , జాతీయ నాయకులు షేర్ అనంత రెడ్డి, శంకర్ పల్లి మండలం అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, రవీందర్ రెడ్డి , బద్దం కృష్ణ రెడ్డి , సహా ఇతర నేతలు చేవెళ్ళ అసెంబ్లీ మాజీ అధ్యకులు పెంట రెడ్డి , రాష్ట్ర మైనారిటీ జనరల్ సెక్రటరీ అశ్వాక్ పటేల్ , సయ్యద్ వసీం , మైనార్టీ నాయకులు తదితరులు మున్సిపల్ అధ్యక్షులు , సీనియర్ నాయకులు శంకర్పల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ అభ్యర్థులు స్థానిక కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ , మహిళా కాంగ్రెస్ , ముఖ్య కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ పేపర్ల ముద్రణ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



**నేటి సాక్షి, నిర్మల్ :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి, బ్యాలెట్ పేపర్ల ముద్రణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు గురువారం పట్టణంలోని ఆదర్శనగర్ లో గల విజయ్ ఆఫ్ సెట్ ప్రింటింగ్ ప్రెస్ లో, మున్సిపల్ ఎన్నికల బ్యాలెట్ పేపర్ల ముద్రణ ప్రక్రియను, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైనన్ని బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణలో ఎటువంటి లోపాలు తలెత్తకూడదని పేర్కొన్నారు. అనధికార వ్యక్తులను ఎవరిని ముద్రణ కేంద్రంలోకి అనుమతించకూడదని చెప్పారు. ముద్రణ ప్రక్రియ మొత్తం పూర్తయ్యేంతవరకు పటిష్ట పోలీసు బందోబస్తు కొనసాగించాలని వివరించారు. బ్యాలెట్ పేపర్ ముద్రణ విధులు కేటాయించిన సిబ్బంది, ముద్రణ తీరును మొత్తం క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు.ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, జెడ్పీ సీఈవో శంకర్, ఉద్యానవన పంటల అధికారి రమణ, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బెంగళూరుదే డబ్ల్యూపీఎల్ కిరీటం

## ఢిల్లీకి మళ్లీ నిరాశే.. ఫైనల్ పోరులో ఆర్సీబీ ఘన విజయం

### స్మృతి మంధాన కెప్టెన్ ఇన్నింగ్స్.. దక్కని ఢిల్లీ పోరాటం

### 203 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన ఛాలెంజర్స్

**మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 టైటిల్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జైత్రయాత్ర కొనసాగింది. గురువారం రాత్రి వడోదరలోని బీసీఏ స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పై 6 వికెట్ల తేడాతో ఆర్సీబీ ఘన విజయం సాధించింది. వరుసగా నాలుగోసారి ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్, ఈసారి కూడా రన్నరప్‌గానే మిగిలిపోగా, స్మృతి మంధాన సేన రెండోసారి ట్రోఫీని ముద్దాడి చరిత్ర సృష్టించింది. 204 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆర్సీబీ 19.4 ఓవర్లలోనే ఛేదించి సత్తా చాటింది.**



టాస్ గెలిచిన ఆర్సీబీ బౌలింగ్ ఎంచుకోగా, ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఢిల్లీ బ్యాటర్ లారా వోల్వార్ట్ 25 బంతుల్లో 44 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు గట్టి పునాది వేసింది. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా దూకుడుగా ఆడారు. ఇన్నింగ్స్ చివరిలో చినెల్ హెన్రీ విశ్వరూపం చూపించింది. కేవలం 15 బంతుల్లోనే 35 పరుగులు చేసి అజేయంగా నిలిచి, స్కోరును 200 దాటించడంలో కీలక పాత్ర పోషించింది. అయితే, ఇంత భారీ స్కోరు చేసినా, బౌలర్లు దానిని కాపాడుకోవడంలో విఫలమవడం ఢిల్లీకి శాపంగా మారింది. ఫైనల్ ఒత్తిడిని జయించలేక ఢిల్లీ బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చారు.

#### స్మృతి మంధాన సేన రికార్డు ఛేదన

204 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఆరంభంలోనే షాక్ తగిలింది. స్టార్ ప్లేయర్ గ్రేస్ హారిస్ తొలి బంతికే (గోల్డెన్ డక్) హెన్రీ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యింది. కానీ, ఆ తర్వాత జరిగినది అసలు సిసలైన పోరాటం. కష్టకాలంలో క్రీజులో నిలిచిన కెప్టెన్ స్మృతి మంధాన, జార్జియా వోల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. స్మృతి మంధాన అద్భుతమైన బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. నందిని శర్మ వేసిన ఒకే ఓవర్‌లో 4, 4, 6 బాది ప్రత్యర్థి బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. తన అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టును గెలిపించిన స్మృతి మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది.

#### చివరి ఓవర్ ఉత్కంఠ

మ్యాచ్ చివరి వరకు ఉత్కంఠగా సాగినా, ఆర్సీబీ బ్యాటర్లు సంయమనం కోల్పోలేదు. 19.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసి విజయాన్ని అందుకోగా, మైదానం మొత్తం 'ఆర్సీబీ.. ఆర్సీబీ' నినాదాలతో హోరెత్తింది. ఫైనల్ మ్యాచ్‌లో 200 పైచిలుకు స్కోరును కాపాడుకోలేకపోవడం ఢిల్లీ బౌలింగ్ లోపాలను ఎత్తిచూపుతోంది. ముఖ్యంగా పవర్ ప్లే తర్వాత వికెట్లు తీయడంలో వారు విఫలమయ్యారు. వరుసగా ఫైనల్స్ ఓడిపోతున్నామన్న మానసిక ఒత్తిడి ఢిల్లీ ఫీల్డింగ్, బౌలింగ్‌లో స్పష్టంగా కనిపించింది. వడోదర పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామంగా మారింది. మంచు ప్రభావం కూడా ఛేజింగ్ చేసే జట్టుకు కలిసి వచ్చింది. మొత్తానికి, మహిళల క్రికెట్‌లో ఆర్సీబీ తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకోగా, ఢిల్లీకి మాత్రం కప్పు ఊరించి ఉసురుమనిపించింది.




# సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

## అనురాగ్ ఠాకూర్‌పై నిషేధం ఎత్తివేత!

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వ్యవహారాల్లో పాల్గొనకుండా మాజీ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్‌పై విధించిన నిషేధాన్ని సుప్రీంకోర్టు ఎత్తివేసింది. ఈ మేరకు నేడు (ఫిబ్రవరి 5) సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు 2017 జనవరి ఆదేశాలను సవరించి ఇకపై నియమాలు, నిబంధనలకు అనుగుణంగా ఠాకూర్ బీసీసీఐ కార్యకలాపాల్లో పాల్గొనవచ్చని స్పష్టం చేసింది. 2017 జనవరిలో సుప్రీంకోర్టు అనురాగ్ ఠాకూర్‌ను బీసీసీఐ వ్యవహారాలకు దూరంగా ఉండాలని ఆదేశించింది. అప్పుడు ఐసీసీ మాజీ చైర్మన్ శశాంక్ మనోహర్‌కు లేఖ రాసిన విషయంపై తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని ఆరోపణలు వచ్చాయి. దీంతో సుప్రీంకోర్టు అవమాన, అబద్ధ ప్రమాణం కేసులు నమోదు చేసింది. ఆ తర్వాత ఠాకూర్ వ్యక్తిగతంగా కోర్టులో హాజరై క్షమాపణ తెలిపారు. దీంతో 2017 జూలై 14న సుప్రీంకోర్టు ఆయనపై కేసులను రద్దు చేసింది. ఇప్పుడు ఠాకూర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తి జోయ్‌మాల్య బాగ్చి ధర్మాసనం "డాక్టరీని అఫ్ ప్రోపోర్టివ్నాలిటీ" సూత్రాన్ని వర్తింపజేసి పాత ఆదేశాలను సవరించింది. ఠాకూర్ క్షమాపణ చెప్పిన విషయాన్ని కూడా కోర్టు పరిగణలోకి తీసుకుంది.



# భారత్‌ను ఓడించే సత్తా వారికి మాత్రమే ఉంది

## టీ20 వరల్డ్ కప్‌పై చహల్ ఆసక్తికర వ్యాఖ్యలు..

టీమిండియాలో అనుభవజ్ఞుడైన స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ చాలా కాలంగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ၥ20 వరల్డ్ కప్ 2024 జట్టులో ఉన్నప్పటికీ ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. చహల్ చివరి అంతర్జాతీయ మ్యాచ్ 2023 ఆగస్టులో వెస్టిండీస్‌తో జరిగింది. అయితే.. తాజాగా ఓ జాతీయ మీడియా సంస్థ ప్రోగ్రామ్‌లో చహల్ పాల్గొన్నాడు. తన కెరీర్, టీమ్ ఇండియా భవిష్యత్తు, సోషల్ మీడియా ట్రోలింగ్, రిటైర్మెంట్ ప్లాన్‌ల గురించి మనసు విప్పి మాట్లాడాడు. ఆ మాటల్లో ఆత్మవిశ్వాసం, బాధ భారత క్రికెట్‌పై నమ్మకం కనిపించింది. కాగా.. ఈ ప్రోగ్రామ్‌లో 2026 టీ20 వరల్డ్‌కప్ గురించి చహల్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తికరంగా మారాయి. "భారతదేశం తన చేతిలోనే తానే ఓడిపోతుంది. మనం తప్పు చేస్తేనే ఓడిపోతాం. మిగతా జట్లు మనల్ని ఓడించే స్థాయిలో లేవు." అని తెలిపాడు. ప్రస్తుతం వరల్డ్ కప్ టీం గురించి ప్రస్తావిస్తూ.. టీమ్‌లో అనుభవం ఉన్న ఆటగాళ్లు, కొత్త ఉత్సాహంతో ఉన్న యువకులు ఉన్నారు. జట్టు బలంగా ఉందని చెప్పుకొచ్చాడు. చహల్ ట్రోలింగ్స్‌పై స్పందించాడు. తనకు ట్రోలింగ్స్ పెద్దగా బాధ పెట్టవని చెప్పాడు. కానీ కొందరు తన పేరుతో ఇతరుల పేర్లు కలిపి వ్యక్తిగత కథలు అల్లుతారు. అది మాత్రం బాధగా ఉంటుందని వెల్లడించాడు. అయినా ఇలాంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకుండా క్రికెట్‌పైనే దృష్టి పెడుతున్నట్లు తెలిపాడు. రిటైర్మెంట్‌పై వస్తున్న వార్తలపై చహల్ వివరణ ఇచ్చాడు. "ఇంకా 5ఉ6 సంవత్సరాలు ఆడాలనుకుంటున్నాను. మైదానంలోకి వెళ్లినప్పుడు ఆనందం, ఆడాలనే తపన ఉంటే చాలు. అప్పటివరకు క్రికెట్‌నే నా ప్రపంచం" అని స్పష్టం చేశాడు. 35 ఏళ్ల వయసులోనూ అతనిలో ఉన్న ఆత్మవిశ్వాసం అభిమానులకు ధైర్యం ఇస్తోంది. అయితే.. బౌలర్ల గురించి మాట్లాడుతూ.. జస్ప్రీత్ బుమ్రాను ప్రపంచంలోనే నంబర్ వన్ బౌలర్‌గా అభివర్ణించాడు. హార్దిక్ పాండ్యాను జట్టుకు అత్యంత కీలకమైన ఆల్‌రౌండర్ అని తెలిపాడు. తిలక్ వర్మ, అభిషేక్ శర్మ లాంటి యువ ఆటగాళ్లను ప్రత్యేకంగా మెచ్చుకున్నాడు. వాళ్లలో దూకుడు ఆలోచన ఉందని, అదే టీమ్‌కి కొత్త శక్తినిస్తోందని అన్నాడు. కెప్టెన్సీ గురించి కూడా చహల్ ఓ ఆసక్తికర మాట చెప్పాడు. కెప్టెన్ ఎవరు అన్నది పెద్ద విషయం కాదు. ఆటగాళ్లు తమ ఆటపై దృష్టి పెట్టాలని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

# పాకిస్థాన్‌తో ఆడేందుకు భారత్ సిద్ధం..

## కొలంబో ఫ్లైట్ బుక్ అయింది!


### ఫిబ్రవరి 15న భారత్-పాకిస్థాన్ మ్యాచ్

### సూర్యకుమార్ యాదవ్ కీలక వ్యాఖ్యలు



టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా ఫిబ్రవరి 15న జరగాల్సిన భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌పై ఉత్కంఠ నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలనే నిర్ణయంపై స్పందించిన సూర్య.. పాక్‌తో మ్యాచ్ ఆడేందుకు టీమిండియాకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశాడు. ఐసీసీ నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్ ఆడేందుకు సిద్ధమని, భారత్ ఎప్పుడూ పాక్‌తో ఆడేందుకు నిరాకరించలేదని వెల్లడించాడు. పాకిస్థాన్ ప్రభుత్వం బంగ్లాదేశ్‌కు మద్దతుగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఈ వివాదం మరింత రాజకీయ రంగు పులుముకుంది. దీంతో ఐసీసీ ఈ అంశాన్ని ఎలా పరిష్కరిస్తుందన్న దానిపై ఆసక్తి పెరిగింది. భారత్, పాకిస్థాన్ ఒకే గ్రూప్‌లో ఉండగా.. శ్రీలంకతో కలిసి భారత్ ఈ టోర్నీకి ఆతిథ్యం వహిస్తోంది. భారత్ఉపాక్ మ్యాచ్‌ను కొలంబోలో నిర్వహించాలని ఐసీసీ ముందుగానే నిర్ణయించింది. ముంబైలో మీడియాతో సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ 'మా మైండ్‌సెట్ చాలా క్లియర్. మేము పాక్‌తో ఆడేందుకు ఎప్పుడూ నిరాకరించలేదు. పాక్ వైపు నుంచి నిర్ణయం తీసుకున్నారు. ఐసీసీ ఫిక్చర్ ఇచ్చింది, ప్రభుత్వాలు న్యూట్రల్ వేదికను నిర్ణయించాయి. కొలంబోకి మా ఫ్లైట్ ఇప్పటికే బుక్ అయింది. మ్యాచ్ కోసం మేము వెళ్తాం కూడా. ఆ తర్వాత ఏమవుతుందో మా చేతుల్లో లేదు' అని అన్నారు. భారత్‌తో మ్యాచ్‌ను పాకిస్థాన్ బహిష్కరిస్తే.. పాక్ జట్టు రెండు పాయింట్లు కోల్పోయే అవకాశముంది. అయితే దీనికి మించి పీసీబీపై ఐసీసీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఇంకా స్పష్టత లేదు. పాకిస్థాన్‌పై బ్యాన్ విధించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అలానే ఏ టీమ్ కూడా పాక్ వెళ్లకుండా ఆదేశాలు జారీ చేసే అవకాశాలు ఉన్నాయి. అలానే పీఎస్ఎస్ టోర్నీలో కూడా విదేశీ ప్లేయర్స్ ఆడకుండా కూడా ఐసీసీ బ్యాన్ చేయనుంది. మెగా టోర్నమెంట్ ప్రారంభానికి ముందే ఈ వివాదం చోటుచేసుకోవడంతో.. టీ20 వరల్డ్ కప్ 2026పై ప్రపంచ క్రికెట్ వర్గాల్లో ఆసక్తి మరింత పెరిగింది.

# ఈసారి టీ20 వరల్డ్ కప్ మాదే..




## పాకిస్థాన్ కెప్టెన్ ఆసక్తికర వ్యాఖ్యలు!

### 2021 తర్వాత మేము ఐసీసీ ట్రోఫీలు గెలవలేకపోయాం

### మేము మంచి క్రికెట్ ఆడలేదు • అభిమానులను మేము నిరాశపర్చాం

పాకిస్తాన్ క్రికెట్ అభిమానులను ఉత్సాహపరిచే విధంగా సీనియర్ క్రికెటర్ సల్మాన్ అలీ ఆఘా కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో పాక్ జట్టు ఎదుర్కొన్న సవాళ్లు, ఫలితాలపై స్పందించారు. పాకిస్తాన్ కొన్ని ప్రధాన ట్రోఫీలు గెలవలేకపోయినప్పటికీ.. ఈ సారి కొత్త ఉత్సాహంతో ఆడేందుకు జట్టు సిద్ధంగా ఉందన్నాడు. ఈ సారి టీ20 వరల్డ్ కప్ గెలిచి పాకిస్తాన్ అభిమానులను సంతోషపెట్టాలని చూస్తున్నాం అని పాకిస్థాన్ కెప్టెన్ చెప్పాడు. సల్మాన్ అలీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సల్మాన్ అలీ ఆఘా మాట్లాడుతూ '2021 తర్వాత మేము ఐసీసీ ట్రోఫీలు గెలవలేకపోయాం. ఆసియా కప్, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కూడా గెలవలేదు. మేము మంచి క్రికెట్ ఆడలేదు. పాకిస్తాన్ అభిమానులను మేము నిరాశపర్చాం. కానీ ఈసారి మేము పూర్తిగా సిద్ధమయ్యాం. మేము ఇప్పుడు బ్రాండ్ క్రికెట్ ఆడుతున్నాము. టీ20 ప్రపంచకప్ గెలిచి పాకిస్తాన్ అభిమానులను సంతోషపెడతాం' అని చెప్పాడు. జట్టు గత వైఫల్యాలను మర్చిపోని, ప్రస్తుత




ప్రదర్శనతో అభిమానులను గర్వపడేలా చేస్తామని సల్మాన్ అలీ చెప్పుకొచ్చాడు. ఈ వ్యాఖ్యలు పాకిస్తానీ క్రికెట్ ప్రపంచంలో చర్చకు దారి తీసాయి. టోర్నీ ప్రారంభానికి ముందు ఈ ప్రకటనతో అభిమానుల్లో జట్టుపై నమ్మకం మరింత పెరిగింది.



# శ్రీ చిదంబరం గారు.. ఓ మంచి కథ

వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ జంటగా నటించిన చిత్రం 'శ్రీ చిదంబరం గారు'. వినయ్-రత్నం దర్శకుడు. చింతా వినీషారెడ్డి, చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాతలు. ఫిబ్రవరి 6న వంశీ నందిపాటి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఆ వేడుకకు నటి, నిర్మాత నిహారిక హాజరయ్యారు. మనసులోతుల్లో నుంచి పుట్టిన కథలే గొప్పవి అని ఆమె అన్నారు. ఇలాంటి కథలకు తప్పకుండా ఆదరణ లభిస్తుందని అన్నారు.




# అట్లీ, అల్లు అర్జున్ మూవీ

## రష్మిక హీరోయిన్ అంటూ ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ వరల్డ్ చిత్రం ఎఎ22 ఇప్పటికే సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్ జానర్‌లో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, దీనిపై అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటు తున్నాయి. సినిమా గురించి చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలో నటించే హీరోయిన్‌ల గురించి మరో క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మరో ముగ్గురు కథానాయికలు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన పేర్లు ప్రముఖంగా వినిపించగా, ఇప్పుడు రష్మిక మందన నిజంగానే షూటింగ్‌లో జాయిన్ అయిందన్న వార్త మరింత హైప్ క్రియేట్ చేస్తోంది. ముంబైలో జరుగుతున్న షెడ్యూల్‌లో రష్మిక పాల్గొంటోందని, అల్లు అర్జున్, జాన్వీ కపూర్, 'కుబేర' ఫేమ్ జిమ్ సర్భ్‌లతో కలిసి కీలక సన్నివేశాల్లో నటిస్తోందని ఓ ఆంగ్ల మీడియా ఛానల్ వెల్లడించింది. దాదాపు నెల రోజుల పాటు కొనసాగే ఈ షెడ్యూల్‌లో యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు ఎమోషనల్ సీన్స్ చిత్రీకరించనున్నట్లు సమాచారం. రమ్యకృష్ణ, యోగిబాబు వంటి ప్రముఖ నటీనటులు కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదే సమయంలో విజయ్ దేవరకొండ,రష్మిక మందన పెళ్లి వార్తలు కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండటంతో ఈ మూవీపై మరింత ఆసక్తి పెరిగింది. 'పుష్ప' సిరీస్‌లో అల్లు అర్జున్ , రష్మిక జంట బ్లాక్‌బస్టర్ హిట్ ఇవ్వడంతో ఈ కాంబో మళ్లీ రిపీట్ అవుతుందా అనే ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఈ చిత్రంలో రష్మిక నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుందన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఆమె కెరీర్‌లో చేయని సరికొత్త పాత్రలో, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. యూనివర్స్ కాన్సెప్ట్‌తో విజువల్ వండర్‌గా తెరకెక్కుతుండగా, అల్లు అర్జున్ మల్టిపుల్ క్యారెక్టర్స్‌లో కనిపించనున్నట్లు సమాచారం.





## 16 ఏళ్ల లోపు వారిని సోషల్ మీడియాకు

# దూరం చేయాలి

### అక్కాచెల్లెళ్ల మృతి ఘటనపై సోనూసూద్ ఆందోళన

సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం యువతను, చిన్నారులను పెను ప్రమాదంలోకి నెడుతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఆన్‌లైన్ గేమింగ్ కారణంగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకోవడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ విషాద ఘటనపై ప్రముఖ బాలీవుడ్ నటుడు, రియల్ హీరో సోనూ సూద్ తీవ్రంగా స్పందించారు. 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించాలని గతంలోనే కోరిన ఆయన.. ఈ తాజా ఘటన నేపథ్యంలో మరోసారి కేంద్ర ప్రభుత్వానికి తన విజ్ఞప్తిని బలంగా వినిపించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు.'ఘజియాబాద్‌లో ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. వారు హింసకో, పేదరికానికో బలవ్వలేదు.. ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ వ్యసనం సృష్టించిన కనిపించని ఒత్తిడికి బలైపోయారు. నేను మళ్ళీ చెబుతున్నాను.. చదువు కోసం తప్ప, మిగతా అన్ని విషయాల్లో 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్‌లను నిషేధించాలి. బాల్యానికి కావాల్సింది సరైన మార్గదర్శకత్వం, ప్రేమ.. అంతే కానీ అల్గారిథమ్స్, స్క్రీన్లు కాదు. ఇది ఎవరినో నిందించడం కోసం కాదు, మన పిల్లలను కాపాడుకోవడం కోసం చేస్తున్న విజ్ఞప్తి. ఈ ఘటనను మరో వార్తగా చూసి మర్చిపోవద్దు.. ఇప్పుడైనా స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది'. అంటూ సోనుసూద్ రాసుకొచ్చాడు.

# మరో జన్మంటూ ఉంటే..

## దర్శకుడిగా పుట్టను: గుణశేఖర్

బలమైన కథలు, భారీ సెట్స్‌లకు పెట్టింది పేరు దర్శకుడు గుణశేఖర్. 'బాల రామాయణం' 'చూడాలని ఉంది', 'ఒక్కడు'లాంటి సినిమాలతో సత్తా చాటిన ఆయన ఇప్పుడు ఈతరం కథతో 'యుఫోరియా' ను తెరకెక్కించారు. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా 'మరో జన్మంటూ ఉంటే దర్శకుడిగా పుట్టను' అని ఇటీవల వ్యాఖ్యానించారు. 'డైరెక్టర్‌గా ప్రతిభ చాటిన మీరు అలా ఎందుకు అనాల్సి వచ్చింది? ట్రోలింగ్ కారణమా?' అని గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఓ విలేకరి ప్రశ్నించగా.. గుణశేఖర్ సమాధానమిచ్చారు.ట్రోలింగ్ సమస్య కాదు. అది ఎప్పుడూ ఉంటుంది. ఓ దర్శకుడి ఒత్తిడి గురించి చెబుతూ ఆ మాట అన్నాను. డైరెక్టర్ సీటులో కూర్చున్న ఎవరికైనా స్ట్రెస్ తప్పదు. ఏ ఉద్యోగంలోనైనా తృప్తి ఉంటుందిగానీ దర్శకులకు ఉండదు. తృప్తి ఉంటేనే కంటినిండా నిద్రపడుతుంది. అలాంటి నిద్రను 1992లో వదిలేసిన నేను ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నా. మళ్లీ హాయిగా వచ్చే జన్మలోనే నిద్రపోవాలన్న ఉద్దేశంతో డైరెక్టర్‌గా పుట్టను అని అన్నాను' అని వివరణ ఇచ్చారు. భూమిక, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. తాజా ప్రెస్‌మీట్‌లో భూమిక, గుణశేఖర్ కుమార్తె, నిర్మాత నీలిమ గుణ తదితరులు పాల్గొన్నారు. విలేకరులతో 'యుఫోరియా' టీమ్ పంచుకున్న విశేషాలివీ.. హైదరాబాద్‌లో జరిగిన ఓ సంఘటనను యథాతథంగా తెరపైకి తీసుకొచ్చారన్న టాక్ వినిపిస్తోంది. ముందుగా కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని తీయాలని నిర్ణయించుకున్నా. కానీ, కథ రాయడం మొదలుపెట్టాక అన్ని నగరాల్లోనూ, విదేశాల్లోనూ అలాంటి ఘటనలు జరిగాయి. ఈ సినిమాలోని సీన్స్ వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలను గుర్తుచేస్తాయన్నారు.




# బన్సాలీ మూవీ.. దో దీవానే షెహర్ మే'

బాలీవుడ్ స్టార్ నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో సిద్ధాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'దో దీవానే షెహర్ మే'. ఈ చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా చిత్రయూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. అరేంజ్డ్ మ్యారేజ్ సెటప్‌లో కలిసిన ఇద్దరు వ్యక్తులు (శశాంక్ మరియు రోష్ని) మధ్య చిగురించిన ప్రేమ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. శశాంక్ (సిద్ధాంత్) తన ఉచ్చారణ సమస్యలతో ఇబ్బంది పడుతుంటే, రోష్ని (మృణాల్) తన అందం విషయంలో బాధపడుతూ ఉంటుంది. ఇద్దరు అసంపూర్ణమైన వ్యక్తులు ఒకరినొకరు ఎలా అర్థం చేసుకున్నారనేదే ఈ సినిమా. నేటి తరం యువత ప్రస్తుతం ఎదుర్కొంటున్న అభద్రతా భావం, ఒత్తిడి, నిజమైన ప్రేమ వెతుకులాటను ప్రతిబింబించేలా ఈ సినిమాను దర్శకుడు రవి ఉద్యవార్ తెరకెక్కించాడు. తెలుగులో 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాతోనే బాలీవుడ్‌కు పరిచయం అవుతుండటం విశేషం. భన్సాలీ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో ఇలా అరుణ్, జాయ్ సేన్ గుప్తా కీలక పాత్రలు పోషించారు.




Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

## శ్రీశైలానికి పాదయాత్ర



**నేటి సాక్షి, నారాయణపేట (ధన్వాడ):** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో శివస్వాముల శ్రీశైలం పాదయాత్ర గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. కోటపక్క వీధికి చెందిన శివస్వాములు 41 రోజుల దీక్షను పూర్తి చేసుకొని, స్థానిక శివాలయంలో శివలింగానికి ఘనంగా మహా పూజలు నిర్వహించారు. అనంతరం మల్లికార్జున స్వామి దర్శనం కోసం పాదయాత్రగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాములకు వీడ్కోలు పలికారు.

## ఉపాధి పనులను చేసుకోవాలి.

**మంది పల్లి గ్రామ సర్పంచ్ సురేందర్ రెడ్డి....**



**నేటి సాక్షి నారాయణపేట,రిపోర్టర్ ఇమామ్ సాబ్ :** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండలంలోని మంది పల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సర్పంచ్ సురేందర్ రెడ్డి గురువారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, కూలీల హాజరు , పని నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. గ్రామ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఎంతో కీలకమని అన్నారు. మంది పల్లి గ్రామస్తులు జాతీయ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మంది పల్లి గ్రామ ఉప సర్పంచ్ నరేష్ కుమార్, కార్యదర్శి జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ అరుణ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ సేవలు అద్భుతం

**ప్రోగ్రామ్ మేనేజర్ రవి**



**నేటి సాక్షి, నారాయణపేట (ధన్వాడ):** నారాయణపేట జిల్లాలో 108 మరియు 102 అంబులెన్స్ సేవలు అత్యుత్తమంగా అందుతున్నాయని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్‌మేనేజర్ కె. రవి అన్నారు. గురువారం ధన్వాడలో అంబులెన్స్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, వైద్య పరికరాల పనితీరును పరిశీలించారు. ప్రమాద బాధితులు 108 సేవలను, గర్భిణులు మరియు బాలింతలు 102 (అమ్మఒడి) వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జిల్లా వ్యాప్తంగా ఈ సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ సునీల్ కుమార్, ఈఎంటీ భరత్, పైలెట్ వెంకటేష్ పాల్గొన్నారు.

## ఓటరు స్లిప్పులపై అభ్యర్థి ఫొటో

**కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో కోడ్ ఉల్లంఘన**

**కాంగ్రెస్ అభ్యర్థిపై అధికారులకు ఫిర్యాదు**




**నేటి సాక్షి, కరీంనగర్:** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో నిబంధనల ఉల్లంఘనలు కలకలం రేపుతున్నాయి. 33వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని హీనా ఆఫ్రీన్ (భర్త ఎంఏ ఇక్రమ్ అహ్మద్ సిద్ధిఖీ అలియాస్ ఇక్రమ్ సికిందర్) ఎన్నికల నియమావళిని అతిక్రమించారని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ, నోడల్ ఆఫీసర్‌కు హుస్సైనిపురకు చెందిన మహమ్మద్ ఆరిఫుద్దీన్ దబీర్ గురువారం ఫిర్యాదు చేశారు. సదరు అభ్యర్థి తన డివిజన్ పరిధిలో ఓటర్లకు పంపిణీ చేస్తున్న స్లిప్పులపై అభ్యర్థి పేరుతో పాటు, పార్టీ గుర్తును, తన ఫొటోను ముద్రించి నిబంధనలను బేఖాతరు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి (ఎంసీసీ) ప్రకారం ఇటువంటి చర్యలు చట్టవిరుద్ధమని, ఓటర్లను ప్రలోభపెట్టేలా ఉన్న ఈ స్లిప్పుల పంపిణీపై తక్షణమే విచారణ జరిపి అభ్యర్థిపై కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన తన ఫిర్యాదులో కోరారు. ఇక్రమ్ సికందర్ భార్య అయిన హీనా ఆఫ్రీన్ ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# పదవి లేకున్నా సేవ చేశా..

- ఒక్క అవకాశం ఇస్తే డివిజన్‌ను అభివృద్ధి చేస్తా
- 43వ డివిజన్‌స్వతంత్ర అభ్యర్థి అబ్దుల్ గఫార్

**కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 43వ డివిజన్ (గోదాంగడ్డ) స్వతంత్ర అభ్యర్థి మహమ్మద్ అబ్దుల్ గఫార్ తన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శనివారం డివిజన్ పరిధిలో పర్యటించిన ఆయన, తన భార్యను (అభ్యర్థిని) భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.**

**- నేటి సాక్షి, కరీంనగర్ టౌన్:**






### కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతోనే ఈ నిర్ణయం

ఈ సందర్భంగా అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ.. తాము మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ కోసం పని చేశామని, అయితే పార్టీ నుండి 'బి-ఫామ్' రాకపోవడంతో డివిజన్ ప్రజల అభీష్టం మేరకు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నట్లు స్పష్టం చేశారు. "పార్టీ గుర్తింపు లేకపోయినా, ప్రజల ఆశీర్వాదం మాకు అండగా ఉంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### సేవే లక్ష్యంగా ప్రచారం

ఎలాంటి రాజకీయ పదవుల్లో లేనప్పుడే డివిజన్ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని గఫార్ గుర్తు చేశారు. ఇప్పుడు కార్పొరేటర్‌గా ఒక్క అవకాశం ఇస్తే, డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించి, గోదాంగడ్డను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. 43వ డివిజన్ ప్రజల సంక్షేమమే తన ప్రథమ ప్రాధాన్యతని, సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో డివిజన్ ప్రజలు, అబ్దుల్ గఫార్ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతును ప్రకటించారు.

# అడ్వకేట్ స్వప్న హత్యపై ఆగ్రహ జ్వాలలు

- నిందితులను వెంటనే శిక్షించాలి - గజ్వేల్ బార్ అసోసియేషన్ ధర్మయుద్ధం



**నేటి సాక్షి గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో న్యాయవాదులు ఆగ్రహంతో రగిలిపోయారు. చేవెళ్లకు చెందిన అడ్వకేట్ స్వప్నను దారుణంగా హత్య చేసిన ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ గజ్వేల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు పండరి, ఉపాధ్యక్షులు నరేష్ చారి మాట్లాడుతూ న్యాయవాదులపై జరుగుతున్న దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని, ఇటువంటి సంఘటనలు న్యాయవ్యవస్థకు మచ్చతెస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులు తమ విధులు నిర్వహించే సమయంలో భయాందోళనలకు గురికాకుండా ప్రభుత్వం తగిన భద్రత కల్పించాలని కోరారు. అడ్వకేట్ స్వప్న హత్యకు బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి కఠిన శిక్షలు విధించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేకంగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ నిరసనకు గజ్వేల్ ప్రాంతానికి చెందిన పలువురు న్యాయవాదులు సంఘీభావం తెలిపారు.

# వెల్మ సామాజిక వర్గంపై కక్షసాధింపు తగదు



**నేటి సాక్షి, రాయికల్ (ఇమ్మడి విజయ్ కుమార్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్మ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని చేస్తున్న వ్యాఖ్యలపై రాయికల్ పట్టణ వెల్మ సంక్షేమ సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో సంఘ సభ్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తీరును తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే సమయంలో అన్ని కులాలను, వర్గాలను సమానంగా చూస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఆ రాజ్యాంగబద్ధమైన బాధ్యతను విస్మరిస్తున్నారని వారు ఆరోపించారు. రాజకీయ వైరుధ్యాలు ఉంటే వ్యక్తులతో చూసుకోవాలి కానీ, పదేపదే ఒక కులాన్ని దూషిస్తూ మాట్లాడటం వల్ల తమ మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ తెలంగాణ కోసం చేసిన కృషిని గుర్తించి అభిమానులు ఆయనను గౌరవిస్తుంటే, దానిపై విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న వెల్మ నాయకులు ముఖ్యమంత్రి తీరును గట్టిగా నిలదీయాలని, ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని వారు సూచించారు. ఇకనైనా ముఖ్యమంత్రి తన వైఖరిని మార్చుకోకపోతే, రాబోయే ఎన్నికల్లో వెల్మల సత్తా ఏంటో చూపిస్తామని వారు హెచ్చరించారు. అవసరమైతే న్యాయపోరాటానికి కూడా వెనకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దుగ్యాల రాజేశ్వర్ రావు, యాచమనేని శ్రీనివాసరావు, సంతోష్ రావు, జకిలేటి హరీష్ రావు, జకిలేటి రాజశేఖర్ రావు, ప్రశాంత్ రావు, యాచమనేని కిరణ్ రావు, లక్ష్మణ్ రావు, వేణు రావు, కరుణాకర్ రావు, రమాపతి రావు, శ్రీనివాస్ రావు, సాగర్ రావు, రత్నాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ పకడ్బందీగా చేపట్టాలి

**నేటి సాక్షి మంచిర్యాల జిల్లా :** మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి మండల పరిధిలో మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ బ్యాక్ వాటర్ కారణంగా ముంపుకు గురయ్యే భూముల సేకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో ఆర్ డి ఓ శ్రీనివాస్ రావు తో కలిసి భూసేకరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ బ్యాక్ వాటర్ కారణంగా జిల్లాలోని కోటపల్లి మండల పరిధిలో గల దేవులవాడ, అర్జునగుట్ట, రావులపల్లి, రాపనపల్లి గ్రామాల భూములు ప్రభావితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో భూసేకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అర్హులైన రైతులకు నష్టపరిహారం అందించడంలో భాగంగా భూసేకరణ సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | శుక్రవారం 06 ఫిబ్రవరి 2026

# మామిడి తోటల్లో పిందె రాలకుండా జాగ్రత్తలు

- ఉద్యాన అధికారి స్వాతి

**నేటి సాక్షి, రాయికల్:** రాయికల్ మండలంలోని పలు గ్రామాల్లో మామిడి తోటలను ఉద్యాన అధికారి కందుకూరి స్వాతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు పిందె రాలకుండా ఉండాలంటే తోటలకు సక్రమంగా నీటి తడులు అందించాలి. తేనెమంచు, తామర పురుగుల నివారణకు 10 లీటర్ల నీటికి ఇమిడాక్లోప్రిడ్ 4ఎత్రీ లేదా తయోమెథక్సిమ్ 4గ్రా, వేపనూనె కలిపి పిచికారీ చేయాలి. బూడిద తెగులుకు హేగ్జాకోనాజోల్ 20ఎత్రీ, పిందె రాలకుండా ప్లానోఫిక్స్ 2.5ఎత్రీ చొప్పున 10 లీటర్ల నీటికి కలిపి వాడాలి.



నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు 13-0-45 ఎరువును 100 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి.



ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి రాజేష్ రైతులు పాల్గొన్నారు.

# నాగాలయంలో శివరాత్రి జాతర ఏర్పాట్లపై సమీక్ష



**నేటి సాక్షి, రాయికల్ (ఇమ్మడి విజయ్ కుమార్):** రాయికల్ మండలంలోని కొత్తపేట శ్రీ రాజరాజేశ్వర నాగాలయంలో త్వరలో జరగనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాల ఏర్పాట్లపై గురువారం ఆలయ ప్రాంగణంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ నాగార్జున, ఎస్సై సుధీర్ రావు ముఖ్య అతిథులుగా హాజరై ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ నాగార్జున మాట్లాడుతూ.. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా స్వచ్ఛమైన తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, నిరంతర విద్యుత్ సరఫరా మరియు అంబులెన్స్ సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎస్సై సుధీర్ రావు మాట్లాడుతూ.. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉత్సవాల సమయంలో నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆలయ కమిటీ వారు నిర్ణీత సమయానికే కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలని, పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. కొత్తపేట సర్పంచ్ మీనుగు అంజయ్య మాట్లాడుతూ.. జాతరను విజయవంతం చేయడంలో గ్రామస్తులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ముఖ్యంగా భక్తుల సౌకర్యార్థం రాత్రి వేళల్లో నిలిపివేసిన కొత్తపేట - జగిత్యాల బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుష్మ, ఆలయ ఈవో విక్రమ్, వైద్యాధికారి సతీష్, ఆర్టీసీ అధికారి రవీందర్, ఆలయ కమిటీ చైర్మన్ దానవేని రాము, డైరెక్టర్లు వెంకట్, సత్తన్న, సత్యనారాయణ, ముత్యం, సర్పంచులు రాజగంగు - అంజయ్య, చంద్రశేఖర్ మరియు నాయకులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లిలో వరుస దొంగతనాలకు చెక్

- ఏడుగురు నిందితుల అరెస్ట్
- 15 తులాల బంగారం, 32 తులాల వెండి స్వాధీనం..
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** మెట్‌పల్లి పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు నిందితుల ముఠాను మెట్‌పల్లి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ. లక్షల విలువైన 15 తులాల బంగారం, 32 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడించారు. మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. గత జనవరిలో పట్టణంలో జరిగిన ఆరు దొంగతనాల కేసులను ఛేదించేందుకు డీఎస్పీ రాములు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సీసీటీవీ ఫుటేజ్, డాగ్ స్క్వాడ్ ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించినట్లు తెలిపారు. మంగళవారం కొత్త బస్టాండ్ వద్ద వాహన తనిఖీల్లో పండుగ రమేశ్, పల్లెపు రమేశ్‌లను అదుపులోకి తీసుకోగా, వారు ఇచ్చిన సమాచారంతో మిగతా ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో పండుగ రమేశ్, పల్లెపు రమేశ్‌తో పాటు గుంజె గంగాధర్, ఒర్సు గంగమణి, గైని కిరణ్, పెద్దూరు మల్లేశ్వరి, చోరీ సొత్తు కొనుగోలు చేసిన ఇందూరి రాకేష్ ఉన్నారు. వీరి నుంచి గొలుసులు, నెక్లెస్‌లు, చైన్లు మరియు వెండి పట్టా




గొలుసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో దొంగలు మరింత రెచ్చిపోయే అవకాశం ఉందని, ప్రజలు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. నివాస గృహాలు, వాణిజ్య సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద



వ్యక్తులు కనిపిస్తే వెంటనే '100'కు డయల్ చేయాలని కోరారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎస్పీ రివార్డులు అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ రాములు, సీఐ అనిల్ కుమార్, ఎస్ఐలు కిరణ్ కుమార్, అనిల్, నవీన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల వేళ కట్టుదిట్టమైన తనిఖీలు




- జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వాహనాల తనిఖీలు
- నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్

**నేటి సాక్షి - కోరుట్ల, రాధారపు నర్సయ్య :** మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలనే లక్ష్యంతో జగిత్యాల జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో అక్రమ కార్యకలాపాలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మెట్‌పల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ జరుగుతున్న వాహన తనిఖీలను ప్రత్యక్షంగా పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. తనిఖీల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని తెలిపారు. అక్రమ నగదు, మద్యం, ఉచిత పంపిణీలు, ఇతర ఎన్నికల ప్రలోభాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని వెల్లడించారు. అనుమానాస్పద వాహనాలు, నిషేధిత వస్తువుల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి, ఎలాంటి లోపాలు లేకుండా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో సరైన ఆధారాలు లేకుండా భారీ మొత్తంలో నగదు తరలిస్తే వెంటనే సీజ్ చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. అత్యవసర అవసరాల కోసం నగదు తీసుకెళ్లే వారు తప్పనిసరిగా సంబంధిత బిల్లులు, సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కీలక ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, నిరంతర వాహన తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ పూర్తిగా సిద్ధంగా ఉందని, ఎన్నికల ప్రక్రియను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తి చేయడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ కోరారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వెంట డీఎస్పీ రాములు, మెట్‌పల్లి సీఐ అనిల్ కుమార్, ఎస్ఐ కిరణ్ కుమార్‌తో పాటు చెక్‌పోస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం

## విజయవంతం

### స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

### సర్పంచ్ వట్టికూటి నాగయ్య



**నేటి సాక్షి, చిలుకూరు:** మండలంలోని బేతవోలు గ్రామంలో స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ (కోదాడ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వట్టికూటి నాగయ్య మరియు మండల విద్యాధికారి (వీజూా) మ్యాగీ గురవయ్య మాట్లాడుతూ.. పేద, బడుగు బలహీన వర్గాల వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్సలు చేయించడం ట్రస్ట్ చేస్తున్న గొప్ప సేవ అని కొనియాడారు. 95 మంది శస్త్రచికిత్సకు ఎంపిక: ఈ శిబిరానికి సుమారు 250 మంది బాధితులు హాజరుకాగా, వైద్యులు వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో తీవ్రమైన కంటి సమస్యలతో బాధపడుతున్న 95 మందిని శస్త్రచికిత్స కోసం ఎంపిక చేశారు. ఎంపికైన వారిని ప్రత్యేక బస్సులో సూర్యాపేటలోని లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు నీలా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి కిట్టు, చారుగుండ్ల ప్రవీణ రాజశేఖర్, ఉపసర్పంచ్ ఏడుకొండలు, ప్రధానోపాధ్యాయులు రాంశెట్టి రామనర్సయ్య, ట్రస్ట్ సభ్యులు కొండలే రవి, కాళంగి వెంకటేశ్వర్లు, కుక్కడుపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు చేయూతగా పెళ్లిరోజు

## విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించిన దంపతులు



**నేటి సాక్షి, ఎండపల్లి:** పెళ్లిరోజును ఆడంబరాలకు కాకుండా సేవకు అంకితం చేస్తూ.. మండలంలోని చర్లపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శేరే జ్యోతి-మహేష్ దంపతులు గురువారం ఏకరూప దుస్తులను (టీషర్ట్స్) అందించిన కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంది. విద్యే భవిష్యత్తుకు బాట వేస్తుందనే ఉద్దేశంతో తమ పెళ్లిరోజును విద్యార్థుల సేవకు అంకితం చేశామని దంపతులు తెలిపారు. సమాన వేషధారణతో పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరిగి, విద్యపై మరింత ఆసక్తి ఏర్పడుతుందని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేసి, తమ వివాహ వేడుకలను విద్యార్థుల మధ్య నిర్వహించుకుని మిఠాయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యం మాట్లాడుతూ.. దంపతుల దాతృత్వం ఆదర్శనీయమని, యూనిఫామ్‌ల ద్వారా విద్యార్థుల్లో ఉత్సాహం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడిదం మొగిలి, అల్లం తిరుపతి, ఉపాధ్యాయులు కర్ణాకర్, అంగన్వాడి ఉపాధ్యాయురాలు కడారి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# చలో ఢిల్లీ ధర్నా

## హాజరైన కరీంనగర్ ఉపాధ్యాయులు



**నేటి సాక్షి (కరీంనగర్) :** సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని అఖిలభారత ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నేడు ఢిల్లీలో నిర్వహించిన చలో ఢిల్లీ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు ఈ సందర్భంగా ౹ా౼ుఖ యా కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ 30 సంవత్సరాల ఉద్యోగ అనుభవం ఉన్న ఉపాధ్యాయులను మళ్లీ టెట్ పేరుతో పరీక్షించడం భావ్యం కాదని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దామోదర్ రెడ్డి బిక్షం గౌడ్,రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి గార్లతో కలిసి కరీంనగర్ జిల్లా ఉపాధ్యాయులు పాకాల ప్రభాకర్ రెడ్డి, మురళీకృష్ణ, చిట్నేని శ్రీకాంత్ రావు, జాలి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు

TGTEL/25/A1737 | NETI SAKSHI

## భూమి పూజ

**పాల్గొన్న సర్పంచ్ కాసారపు భవాని అరవింద్**



**నేటి సాక్షి, జగిత్యాల, గుండ ప్రశాంత్ గౌడ్ :** గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో మహిళా గ్రామ సంఘ భవన నిర్మాణం కోసం సర్పంచ్ కాసరపు భవాని అరవింద్ భూమి పూజ చేయడం జరిగింది ఈజీఎస్ నిధుల ద్వారా 10 లక్షలు మంజూరు కావడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిరవేణి రవి వార్డ్ సభ్యులు బొమ్మెల మధు బుర్ర తిరుపతి, శ్రీపతుల లత కాళ్ళ జామున ఎండ్రికాయల గంగాధర్ కోమల్ల హనుమంతు గ్రామ సంఘాల అధ్యక్షులు పంచాయతీ కార్యదర్శి నరేష్, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్,మరియు నీరజ, జీవన్, మల్లీశ్వరి మహేందర్ రెడ్డి, రాజేందర్ మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది

## స్రవంతికి డాక్టరేట్ ప్రదానం





**నేటి సాక్షి నల్లగొండ:** నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల (NG College) ఆంగ్ల విభాగంలో ఒప్పంద అధ్యాపకురాలుగా పనిచేస్తున్న స్రవంతి మద్దెలకు డాక్టరేట్ లభించింది. రాజస్థాన్‌కు చెందిన శ్రీ జగదీశ్ ప్రసాద్ జబర్మల్ తిబ్రేవాలా యూనివర్సిటీ ఆమెకు ఈ గౌరవ పట్టాను ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ వెల్లడించారు. డాక్టర్ అన్ను శర్మ పర్యవేక్షణలో సరోజినీ నాయుడు, అరుంధతి రాయ్, ప్రేమ్ చంద్ మరియు యాష్పాల్ రచనలపై "ఎ క్రిటికల్ అనాలిసిస్ ఆఫ్ ఐడియాలాజీ అండ్ ఫెమినిజం" అనే అంశంపై స్రవంతి చేసిన పరిశోధనకు గాను ఈ డాక్టరేట్ లభించింది. డాక్టరేట్ సాధించిన స్రవంతిని కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డా. రవి కుమార్, డా. అంతటి శ్రీనివాస్, పరీక్షల నియంత్రణ అధికారి డా. ముని స్వామి, ఆంగ్ల విభాగం అధ్యక్షులు డా. వై.వి.ఆర్. ప్రసన్న కుమార్, తెలుగు శాఖ అధ్యక్షులు డా. వెల్దండి శ్రీధర్ మరియు ఇతర అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## కచ్చితంగా పాటించాలి

**కలెక్టర్ కుమార్ దీపక్**



**నేటి సాక్షి, మంచిర్యాల:** జిల్లాలో జరగనున్న మున్సిపల్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు '48 గంటల నిబంధన'ను తూచా తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. ఈ నెల 11న పోలింగ్ జరగనున్న తరుణంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందే అన్ని రకాల ప్రచారాలను నిలిపివేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలతో పాటు సోషల్ మీడియా, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదని తెలిపారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించిన వారిపై తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్ 2019, సెక్షన్ 209 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్లను ప్రభావితం చేసే ఏ చర్యకైనా పాల్పడకూడదన్నారు. స్వేచ్ఛాయుతమైన, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మరియు మీడియా యాజమాన్యాలు సహకరించాలని కలెక్టర్ కోరారు.

## సీనియర్ జర్నలిస్టు మరణం



**నేటి సాక్షి గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలం చీమలకుంటపల్లికి చెందిన సీనియర్ జర్నలిస్టు విభూతి వీరకుమార్ (53) గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఉమ్మడి బెజ్జంకి, గన్నేరువరం మండలాల్లో వివిధ పత్రికల్లో పనిచేసిన ఆయన, వార్తల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసి మంచి గుర్తింపు పొందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరకుమార్ మరణం పట్ల స్థానిక సర్పంచ్ జంగిటి ప్రకాష్, జర్నలిస్టు సంఘాల నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- షెడ్యూల్ ప్రకారం కట్టుదిట్టంగా ఎన్నికల నిర్వహణ
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించిన రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** మున్సిపల్ ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని అధికారులకు ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపెల్లి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్ల పురోగతిని అడిగి తెలుసుకుని, పలు కీలక సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జగిత్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి బి. సత్యప్రసాద్‌తో పాటు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని మాట్లాడుతూ పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు సమృద్ధిగా సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ బృందాలు, డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అన్ని భద్రతా ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, కౌంటింగ్ పూర్తైన అనంతరం మున్సిపాలిటీలలో చైర్‌పర్సన్, కార్పొరేషన్లలో మేయర్ ఎన్నిక కోసం ఫారం-2లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులకు ఈ విషయమై ముందుగానే సమాచారం అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల ఎన్నికలు, పోలింగ్, కౌంటింగ్‌కు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. ఇందుకోసం స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, అవసరమైన సిబ్బందిని నియమించామని చెప్పారు. రెండవ రాండమైజేషన్ కూడా పూర్తిచేశామని తెలిపారు. ఐదు మున్సిపాలిటీల్లో జరగనున్న ఎన్నికలకు అవసరమైన పోలింగ్, కౌంటింగ్ సిబ్బందిని నియమించి, వారికి పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించాల్సిన విధులపై తగిన శిక్షణ అందించామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలకు జిల్లా పూర్తిగా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో జరగనున్న ఎన్నికలు, పోలింగ్ సందర్భంగా పకడ్బందీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో తగిన స్థాయిలో పోలీస్ బలగాలను మోహరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, నోడల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నుండి కొత్త వెంకన్న బహిష్కరణ



**నేటి సాక్షి, తిరుమలాయపాలెం (మెట్టు రుద్రరాజు):** పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో హస్నాబాద్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొత్త వెంకన్న (పాల)ను బీఆర్ఎస్ పార్టీ నుండి బహిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మండల అధ్యక్షుడు భాషబోయిన వీరన్న తెలిపారు. ఇకపై వెంకన్నకు పార్టీతో ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. అలాగే, హస్నాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడిని వీరన్న తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొవ్వూరి పద్మ సత్తిరెడ్డి మరియు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలి

- టీజీబీ మేనేజర్ అంజయ్య



**నేటి సాక్షి, జగిత్యాల (గుండ ప్రశాంత్ గౌడ్):** ఆర్బీఐ (RBI) సౌజన్యంతో జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిలువకోడూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (TGB) మేనేజర్ సిహెచ్. అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ చుంచు నరేష్ మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదన్నారు. డిజిటల్ లావాదేవీలు చేసే సమయంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా బ్యాంకుకు వచ్చి అధికారులను సంప్రదించాలని కోరారు. కుటుంబ యజమాని తన తదనంతరం కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఉండేందుకు బీమా పథకాలు దోహదపడతాయని ఆయన వివరించారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా మరియు ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ వంటి పథకాల విశిష్టతను ఖాతాదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, వార్డు సభ్యులు, బ్యాంక్ సిబ్బంది లక్ష్మణ్, మహిళా సంఘాల సభ్యులు, వి.ఓ.ఏలు కాజా మియా, పూజిత, రైతులు మరియు ఖాతాదారులు పాల్గొన్నారు.

# హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

- జిల్లా సెషన్స్ జడ్జి తీర్పు
- నేరం చేసిన వారు శిక్ష నుండి తప్పించుకోలేరు
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**నేటి సాక్షి, జగిత్యాల, గుండ ప్రశాంత్ గౌడ్:** గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అగ్గిమల్ల గ్రామంలో 2021లో జరిగిన తరువేని వెంకటేష్ హత్య కేసులో ముగ్గురు నిందితులకు జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి రత్న పద్మావతి జీవిత ఖైదు విధిస్తూ గురువారం కీలక తీర్పు వెలువరించారు. శిక్షతో పాటు నిందితులకు ఒక్కొక్కరికి రూ. 4,500 జరిమానా విధించారు. అగ్గిమల్ల గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేష్, 2021 అక్టోబర్ 18న అదృశ్యమయ్యాడు. మరుసటి రోజు గ్రామ శివారులోని పొలాల్లో గొంతు కోసి హత్య చేయబడిన స్థితిలో శవమై కనిపించాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు గొల్లపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పాత కక్షల నేపథ్యంలోనే గ్రామానికి చెందిన కొలగాని రాజేందర్ తన స్నేహితులు కస్తూరి మల్లేష్, అవుల కిరణ్ కుమార్‌లతో కలిసి ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. శిక్ష పడిందిలా.. ధర్మపురి సిఐ కోటేశ్వర్ ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఫ్రా) మల్లికార్జున్ వాదనలు, సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి.. నిందితులు కొలగాని రాజేందర్ (27), కస్తూరి మల్లేష్ (30), అవుల కిరణ్ కుమార్ (32) లపై నేరం రుజువు కావడంతో వారికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. నేరం చేసిన వారు ఎవరైనా చట్టం నుండి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. పటిష్టమైన దర్యాప్తు, న్యాయ నిరూపణ ద్వారా నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను, ప్రాసిక్యూషన్ బృందాన్ని ఆయన అభినందించారు.

# ఒకే రోజు 5 గురు నిరుపేదలకు రక్తదానం

- రక్తదానసేవలో మరో కీర్తి
- రక్త దాతలకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపిన చింత సుదీర్
- రక్తదానం చేసిన దాతలు జి.జీవన్, బాబుజని బాయ్,మాగ్గీ సతీష్, ఎస్, శివ, మహేష్,



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు):** జగిత్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న3సంవత్సరాల బాబు అయూబ్ మరియు ప్రసూతి మహిళా మరియు సతీష్ కుమార్ దవాఖానలో ప్లేట్లెట్స్ తక్కువ అయినా పెషేంట్ కి అత్యవసర సమయంలో రక్తదానం చేసిన జగిత్యాల టౌన్ క్రైం కానిస్టేబుల్ జీవన్, మరియు చల్గల్ కి చెందిన బాబుజని, జగిత్యాల నూకపెల్లి కి చెందిన మహేష్,శివ, రాయికల్ కి చెందిన సతీష్,తమ రక్తాన్ని నిండు మనసుతో దానం చేసి మానవత్వం చాటుకున్నారు, రక్తదాతలు మాట్లాడుతూ రక్తదానం చేయడం ఒక నిండు ప్రాణాలను కాపాడే మంచి పనిగా భవిస్తమన్నారు, కానీ రక్తదాతకు నైతిక విలువలు లేకుండా పోతున్నాయి అని ఒక కన్నా కొడుకు తల్లికి తన అన్న కు తమ్ముడు కూడా రక్తదానం చేయడానికి ముందుకు రాణి దుస్థితి లో మేము స్వచ్ఛందంగా సేవ చేస్తున్నా మాకు ఎలాంటి గుర్తింపు లేకుండా పోతుంది అని ఆవేదన వ్యక్తం చేసారు. ఎవరు గుర్తించిన గురించాక పోయిన సేవ అనేది ఒక దైవ ప్రాప్తిగా చేస్తూనే ఉంటామని చెప్పుకొచ్చారు.

# గగనతలం నుండి ఖాకీ నిఘా



- డ్రోన్ల సాయంతో కోడి పందాల స్థావరంపై దాడి
- 13 మంది జూదరుల అరెస్ట్ - పందెం కోళ్లు, నగదు, వాహనాలు స్వాధీనం

**నేటి సాక్షి, చౌడేపల్లి :** అన్నమయ్య జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు, అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ జూదరుల ఆటకట్టిస్తున్నారు. తాజాగా, డ్రోన్ కెమెరాల నిఘాతో బోయకొండ పరిసరాల్లో నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరాన్ని పోలీసులు రట్టు చేశారు. మదనపల్లె డీఎస్పీ ఎస్. మహేంద్రకు అందిన సమాచారం ప్రకారం.. చౌడేపల్లి మండలం బోయకొండ లోని వి.కె. రెసిడెన్సీ వెనుక భాగంలో రహస్యంగా కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పందెం రాయుళ్లు తప్పించుకోకుండా ఉండేందుకు పోలీసులు తొలుత డ్రోన్ కెమెరాల ద్వారా గగనతలం నుండి నిఘా పెట్టారు. పందాలు జరుగుతున్న ప్రదేశాన్ని ఖచ్చితంగా గుర్తించిన అనంతరం, పోలీసులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో 13 మంది జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 25,000 నగదు, 6 కోడి పుంజులు, 13 సెల్ ఫోన్లు మరియు 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌడేపల్లి ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# జగిత్యాలలో కొలువుదీరిన వేంకటేశ్వరుని సైకత శిల్పం

- ప్రారంభించిన ఎమ్మెల్సీ ఎల్. రమణ, పండితులు వేణుగోపాలాచార్య



**నేటి సాక్షి, జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 20 అడుగుల శ్రీ వేంకటేశ్వర స్వామి సైకత (ఇసుక) శిల్ప ప్రతిష్టారాధన కార్యక్రమం గురువారం వైభవంగా ప్రారంభమైంది. ప్రముఖ వాస్తు పండితులు నంబీ వేణుగోపాలాచార్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, స్వామివారిని భక్తుల దర్శనం కోసం అందుబాటులోకి తీసుకువచ్చారు. కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు వేముల ఉమారాణి, కొంద్ర రమాదేవి ఆధ్వర్యంలో రూపొందించిన ఈ అద్భుత సైకత శిల్పం నేటి నుండి మార్చి 5వ తేదీ వరకు నెల రోజుల పాటు భక్తులకు దర్శనమివ్వనుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఎల్. చంద్రశేఖర్, ఎన్నం కిషన్ రెడ్డి, చీటీ శ్రీనివాస్ రావు, సిరిసిల్ల వేణుగోపాల్, బెజ్జంకి సంపూర్ణ చారి మరియు ఇతర భక్తులు పాల్గొని స్వామివారిని సేవించుకున్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు




**నేటి సాక్షి, చౌడేపల్లి :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా గురువారం ఆమె అన్నమయ్య జిల్లా పుంగనూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. కేంద్రం తెచ్చిన కొత్త చట్టం వల్ల కూలీలకు తీరని నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేంద్రమే పూర్తి నిధులు ఇచ్చేదని, ఇప్పుడు రాష్ట్రం 40 శాతం నిధులు భరించాలన్న నిబంధనకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించడం సరికాదన్నారు. ఇప్పటికే రాష్ట్రం అప్పుల్లో ఉందని, మరి ఈ పథకానికి నిధులు ఎక్కడి నుండి తెస్తారని ఆమె ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం నుండి గాంధీ పేరును తొలగించాలని చూడటం దుర్మార్గమన్నారు. ఈ యాత్రలో మాజీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్, నియోజకవర్గ ఇన్చార్జ్ మురళీ మోహన్ యాదవ్ మరియు అధిక సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# హెచ్ఆర్‌సీ జిల్లా జాయింట్ సెక్రటరీ

### గూడూరి గణేష్



**నేటి సాక్షి, గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (HRC) కరీంనగర్ జిల్లా జాయింట్ సెక్రటరీగా గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన గూడూరి గణేష్ నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ నేషనల్ ఫౌండర్ శ్రీకాంత్ చెన్నుపాటి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన నేషనల్ ఫౌండర్ శ్రీకాంత్ చెన్నుపాటి కి, జిల్లా అడిషనల్ జనరల్ సెక్రటరీ కటకం శ్రీకాంత్ కు మరియు తనకు సహకరించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# విద్యార్థులకు గోల్డ్ మెడల్స్



**నేటి సాక్షి, పాములపాడు:** అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్ (గ్రాఫీ) పోటీల్లో పాములపాడులోని శ్రీ వివేకానంద విద్యా విహార్ హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. 6వ తరగతికి చెందిన బి. నాగేంద్రుడు, వి. సింధు మరియు 4వ తరగతికి చెందిన ఎం. తోయజాక్షి గోల్డ్ మెడల్స్ సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. వీరితో పాటు మరో ఏడుగురు విద్యార్థులు జాతీయ స్థాయి (లెవెల్-2) పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 8న కర్నూలులో జరిగే ఫైనల్ పరీక్షలో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఆర్.ఎస్.ఆర్. గోపాల్, బీసీ సంఘం అధ్యక్షులు రాయపాటి మురళి మోహన్ మరియు ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

# లక్ష కుంకుమార్చన



**నేటి సాక్షి, చౌడేపల్లి:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానంలో లక్ష కుంకుమార్చన పూజలు రెండో రోజు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో 108 మంది దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు దేవస్థానం వారు తీర్థప్రసాదాలు అందజేసి, ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఏకాంబరం, అర్చకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# గొలుసు దొంగతనం

### నిందితుడి అరెస్ట్




**నేటి సాక్షి, చేర్యాల:** చేర్యాల మండలం చుంచనకోటలో వృద్ధురాలి మెడలో గొలుసు దొంగిలించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం హుస్నాబాద్ ఏసీపీ సదానందం వెల్లడించిన వివరాల ప్రకారం.. చేర్యాలకు చెందిన ఆరేపల్లి వంశీకృష్ణ (26) మంగళవారం చుంచనకోటలో మంద గాలమ్మ అనే వృద్ధురాలిని మాటల్లో దించి, ఆమె మెడలోని 2.7 తులాల బంగారు గొలుసును గుంజుకుని పారిపోయాడు. గ్రామంలోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి పట్టుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ప్రజలు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. నిందితుడిని పట్టుకున్న సీఐ రమేష్, ఎస్ఐలు నవీన్, మహేష్‌లను ఏసీపీ అభినందించారు.

# అజ్మీర తండా యువకుడికి డాక్టరేట్



**నేటి సాక్షి, తిరుమలాయపాలెం:** మండలంలోని అజ్మీర తండాకు చెందిన బోడ రమేష్ భూగోళశాస్త్రం (Geography) విభాగంలో పీహెచ్‌డీ సాధించారు. తిరుమలాయపాలెం మండలంపై ఆయన చేసిన పరిశోధనకు గాను ఈ డాక్టరేట్ పట్టా లభించింది. గిరిజన కుటుంబం నుంచి వచ్చి, ఎన్నో ఇబ్బందులను అధిగమించి ఉన్నత విద్యలో ఈ ఘనత సాధించడం పట్ల గ్రామస్తులు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రమేష్ విజయం తమ ప్రాంత యువతకు ప్రేరణగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.